ఈనాడు అనకాపల్లి
మంగళవారం 1 సెప్టెంబరు 2026

సీఎం సభకు వేదిక ముస్తాబు

జలహారతి ఇచ్చే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఈనెల 2న పి.ఎల్.పురం వద్ద జరిగే సీఎం బహిరంగ సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మార్కెట్ యార్డు పక్కన జాతీయ రహదారిని ఆనుకుని సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో సభ నిర్వహించనున్నారు. ఇక్కడే హెలిప్యాడ్ నిర్మించారు. దాదాపు 30 వేల మందికి పైగా ఉండే విధంగా ప్రాంగణంలో సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో పాటు వేదిక వద్దకు చేరుకునేందుకు, వాహనాల పార్కింగుకు ప్రత్యేకంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ రోజూ అధికారులతో కలిసి సమీక్షిస్తూ, పోలవరం ఎడమ కాలువ పనులను స్వయంగా పరిశీలిస్తున్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఉత్తరాంధ్ర జిల్లాకు ముఖద్వారంలో నిర్వహించనున్న సభను విజయవంతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఉత్తరాంధ్ర సంస్కృతి ఉట్టిపడేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారు.

చంద్రబాబు పర్యటన షెడ్యూలు ఖరారు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: సీఎం పర్యటనకు సంబంధించిన షెడ్యూల్‌ను కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం విడుదల చేశారు. హెలికాప్టర్‌లో బుధవారం మధ్యాహ్నం 2.20 గంటలకు పి.ఎల్. పురంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు చేరుకుంటారు. అక్కడే ప్రజాప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారు. అనంతరం 2.45 గంటలకు జలహారతి ఇచ్చి గోదావరి జలాలను విడుదల చేస్తారు. 3.30 గంటలకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు తిరుగు పయనమవుతారు.

జల వరం.. జన హితం

✦ కొండకోనలను దాటుకుని జిల్లాకు గోదావరి జలాలు
✦ రేపు జలహారతి ఇవ్వనున్న సీఎం చంద్రబాబు

ఈనాడు డిజిటల్, అనకాపల్లి - న్యూస్‌టుడే, పాయకరావుపేట పట్టణం

ఉత్తరాంధ్ర వాసుల చిరకాల కోరిక నెరవేరుతోంది. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు వచ్చి వడిగా చేరనున్నాయి. దాదాపు పుష్కరకాలం ఎదురుచూపులకు సెప్టెంబరు 2తో తెరపడనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాయకరావుపేట గోదారమ్మకు జలహారతి ఇవ్వనున్నారు. అడ్డంకులను అధిగమించి.. కొండలు, కోనలను దాటుకుంటూ ఈ రెండేళ్లలో పోలవరం ఎడమ కాలువ పనులు త్వరితగతిన జరిగాయి. సివిల్ ఇంజినీరింగులో ఉన్న అన్ని సాంకేతిక పద్ధతులను కాలువ తవ్వకంలో వినియోగించడం విశేషం.

ప్రారంభం	పోలవరం జిల్లా నేలకోట వద్ద
ముగింపు	విశాఖ జిల్లాలోని మేహాద్రిగెడ్డ
కాలువ పొడవు	213.409 కి.మీ.
ఉమ్మడి తూ.గో. జిల్లాలో	111 కి.మీ.
ఉమ్మడి విశాఖ జిల్లాలో	112.409 కి.మీ.
సాగునీరు అందేది	46,620 ఎకరాలు
తాగునీరు	290 గ్రామాలు

● జిల్లాలో సాగునీటి అవసరాలకు చెలికిపెట్టేందుకు వీలుగా గోదావరి జలాలను 98 చెరువుల్లో నింపనున్నారు. ఇందుకోసం పాయకరావుపేట, ఎలమంచిలి, అనకాపల్లి తదితర ఐదు చోట్ల ఆఫ్‌టేక్ స్లూయిస్‌లు నిర్మించారు.

● పాయకరావుపేటలోని తాండవ, భూమి కాలువల్లోకి, వరహా, శారద నదుల్లోకి, కొక్కిరాపల్లి, తుమ్మపాల సమీపంలోనూ నీటి విడుదలకు ఏర్పాట్లు చేశారు.

● పాయకరావుపేట నుంచి తాళ్లపాలెం వరకు 51.4 కి.మీ.పొడవైన కాలువలో పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, ఎలమంచిలి, అనకాపల్లి పరిధిలో 10కి పైగా వంతెనలు నిర్మించారు. తాండవ నదిపై ఆరు వెంట్లతో (ద్వారాలు) 447 మీటర్ల పొడవైన అక్విడక్టు నిర్మించారు. దీని ద్వారా 10,634 క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా డిజైన్ చేశారు. అక్విడక్ట్ నుంచి వస్తున్న నీటిని రెగ్యులేట్ చేసేందుకు వీలుగా అక్విడక్టుకు సమీపంలో తాండవ చక్కెర కర్మాగారం వెనుక ఆఫ్‌టేక్ స్లూయిస్ నిర్మించారు. దీనికి ఆరు తలుపులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా వరహా నదిపై అక్విడక్ట్‌ను ఎనిమిది స్లాబ్స్‌తో నిర్మించారు. దీన్ని కేవలం 45 రోజుల్లో పూర్తి చేయడం విశేషం.

పరిశ్రమలకు 23.44 టీఎంసీలు.. పరిశ్రమల అవసరాలకు ఏలేరు నదిలో 10 నుంచి 15 వేల క్యూసెక్కుల గోదావరి జలాలు పరుగులు పెట్టనున్నాయి. తాండవ, వరహా, శారద తదితర నదులు ఒక్కో దానిలోకి 100 క్యూసెక్కుల నీటిని ఇస్తారు. విశాఖ నగరం తాగునీరు, పరిశ్రమలు, డాటా సెంటర్ల అవసరాల కోసం 23.44 టీఎంసీల నీటిని కేటాయించారు.

రెండేళ్లలో పనులు పూర్తి..
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి 2024 జులై 11న పర్యటించారు. దార్లపూడి సమీపంలోని పోలవరం ఎడమ కాలువ పనులను నేరుగా పరిశీలించారు. కాలువ పనుల పురోగతిని, అక్విడక్ట్ నిర్మాణం, డిజైన్లను పరిశీలించారు. కాలువ పనుల్లోని అడ్డంకులను సత్వరం అధిగమించి ఉత్తరాంధ్ర ప్రాంతానికి తాగు, సాగు నీరు అందించాలని ఆదేశించారు. కేవలం రెండేళ్ల కాలంలో పనులన్నీ పూర్తయి ప్రారంభానికి సిద్ధమైంది

పాయకరావుపేటలో కొండల నడుమ పోలవరం కాలువ

కొండలను తొలిచి.. కాలువగా మార్చి... అనకాపల్లి, కాకినాడ జిల్లాకు మధ్యనున్న తాండవ నదికి తుని వైపు, పాయకరావుపేట వద్ద కాలువ తవ్వకం ఒక సాహసమేనని చెప్పాలి. కఠినమైన అడ్డంకులను ఇక్కడే ఇంజినీరింగ్ సిబ్బంది ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పాయకరావుపేటలోని తాండవ చక్కెర కర్మాగారం నుంచి రెండు కిలోమీటర్ల పొడవైన కాలువ తవ్వేందుకు అష్టకష్టాలు ఎదురయ్యాయి. రెండు కిలోమీటర్ల పొడవునా కొండను తవ్వాల్సి వచ్చింది. బండరాళ్లు ఉండటంతో బ్లాస్టింగు ద్వారా కొండలను బద్దలు కొట్టాల్సి వచ్చింది. ఎక్కడా లేనివిధంగా కాలువ 8 వంపులు తిరిగింది. ఒక్కో కొండను 108 మీటర్ల ఎత్తు, 27 మీటర్ల లోతుకు తవ్వాల్సి వచ్చింది. సగటున 76 మీటర్ల ఎత్తు కొండలను తొలిచారు. దాదాపు 30 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించారు.

కాలువపై నిర్మించిన వంతెన

కాలువ నిర్మాణానికి చేసిన ఖర్చు (రూ.కోట్లలో)

2004-09	437.09
2009-14	569.62
2014-19	923.60
2019-24	398.02
2024-26	1650 (సుమారు)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం ఎడమ కాలువ తవ్వకానికి ఈ రెండేళ్లలో కేటాయించిన నిధులు రూ. 1710.08 కోట్లు. ఇందులో ఇప్పటివరకు సుమారు రూ.1650 కోట్ల వరకు ఖర్చు చేశారు.

కాయ్‌రాజాకాయ్
చూసీచూడనట్టు వదిలెయ్

రూ.లక్షల్లో జోరుగా పందేలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

నర్సీపట్నం మండలం బయ్యపురెడ్డిపాలెం, గొలుగొండ మండలం కశిమి రోడ్డులోని జీడితోటల్లో చిత్తులాట, కోసు ఆటలు జోరుగా సాగుతున్నాయని స్పెషల్ బ్రాంచి సిబ్బందికి కొద్దిరోజుల కిందట సమాచారం అందింది. జూదం జరిగే ప్రదేశాన్ని కనిపెట్టేందుకు నాలుగైదుసార్లు రౌండ్లు వేసినా ఫలితం లేకపోయింది. వ్యూహం మార్చి అడ్డదారుల్లో, మారువేషాల్లో గుట్టుగా వెళ్లి ఆ ప్రదేశాన్ని కనిపెట్టారు. నర్సీపట్నంలో శాంతిభద్రతలు, స్పెషల్ బ్రాంచి పోలీసులు సంయుక్తంగా రెండు రోజుల కిందట ఆకస్మిక దాడి చేశారు. ఓ జీడితోటలో 40కి పైగా బైకులున్నాయి. వచ్చిందని పోలీసులని గుర్తించగానే కొందరు అప్రమత్తమై బైకులతో పారిపోయారు. తక్కువ మంది సిబ్బందే వెళ్లినప్పటికీ 20 బైకులను స్వాధీనం చేసుకుని, ఆరుగురు జూదరులను పట్టుకున్నారు. వీరిలో నలుగురి వద్ద రూ.1.05 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. విశాలమైన ప్రదేశంలో నేల చదునుగా ఉండడాన్ని చూసి చాలాకాలంగా అక్కడ జూదాలు జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ప్రాంత జీడితోటలపై గ్రామీణ సీఐ రేవతమ్మ పర్యవేక్షణలో పోలీసులు పలుమార్లు డ్రోన్ ఎగరవేసినా జాడ కనిపెట్టలేకపోయారు. జూదాల్లో ఆరితేరిన చేరిన కొందరు ఇది నర్సీపట్నం టౌన్ పరిధి కాదు.. మీరెందుకు వచ్చారని గద్దించినట్లు మాట్లాడటం చూస్తే.. ఎవరి అండతోనో ఇదంతా జరుగుతోందన్న అనుమానం వ్యక్తమవుతోంది. మీరు స్వాధీనం చేసుకున్న బైకు మా వాడిది.. వదిలేయండి అని కొందరు 'పెద్దలు' వత్తిడి తెచ్చినట్లు సమాచారం. జరిగిందేదో జరిగిపోయింది.. కఠిన చర్యలేవీ వద్దని సూచించినట్లు తెలిసింది.

■ జూదాలను కొందరు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అనువైన ప్రదేశాన్ని ఎంపిక చేసి సదుపాయాలు కల్పించినందుకు జూదంలో పాల్గొనే వారంతా నిర్ణీత మొత్తాన్ని నిర్వాహకులకు చెల్లిస్తున్నారు. చిత్తులాట మొదలైే నిమిషాల వ్యవధిలో ముగుస్తుంది. వేల రూపాయలు చేతులు మారుతాయి. ఆ వెంటనే మరో ఆట మొదలవుతుంది. కోసు ఆటగా వ్యవహరించే జూదంలోనూ వేల రూపాయలు చేతులు మారుతున్నాయి. అల్లూరి జిల్లా కొయ్యూరు సరిహద్దులో గొలుగొండ మండలం చోద్యం శివారు ప్రాంతాలు, చోడవరం నియోజకవర్గ పరిధి రోలుగుంట సరిహద్దులో ఏటిగైరంపేట శివారు, కశింకోట మండల సరిహద్దులో మాకవరపాలెం మండలం బూరుగుపాలెం సమీప ప్రాంతాల్లోనూ కోసు ఆట, చిత్తులాటలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. గతంలో ఈ ప్రాంతంలో నాలుగైదు కేసులు నమోదయ్యాయి.

లింగాపురం- కశిమి సమీపంలోని జీడితోటలో జూదానికి సిద్ధం చేసిన ప్రదేశం

■ శివారు ప్రాంతాలు ఒకప్పుడు ప్రశాంతంగా ఉండేవి. ఇప్పుడు పలుచోట్ల నేరగాళ్లకు, ఆకతాయిలకు అడ్డాగా మారాయి. జనసంచారం తక్కువగా ఉండడంతో ఏం చేసినా ఎవరూ ఏం చేయలేరన్న ధీమాతో కొందరు జీడితోటలను అడ్డాగా చేసుకుని జూదాల నిర్వహణకు తెగబడుతున్నారు. జనసంచారం తక్కువగా ఉండడం, సీసీ కెమెరాలు లేకపోవడం, పోలీసుల గస్తీ ఉండకపోవడం జూదరులకు కలిసొస్తోంది. ఎక్కువగా యువత వ్యసనాలకు బానిసై డబ్బు పోగొట్టుకుంటున్నారు. నేరగాళ్ల పెచ్చుమీరక ముందే పోలీసులు కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కస్పా రైతులకూ కష్టకాలమే
పెద్దేరులో అడుగంటిన నీరు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వర్షాల్లేక పెద్దేరులో నీరు అడుగంటింది. పంట కాలువల్లో పూర్తిగా నీటిప్రవాహం నిలిచిపోయింది. ఎప్పుడూ లేనివిధంగా కస్పా భూములకు తీవ్ర నీటిఎద్దడి ఏర్పడింది. ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టు గడిచినా ఆయకట్టు భూముల్లో వరినాట్లు పడకపోవడం ఇదే మొదటిసారి. అక్కడక్కడ వేసిన నాట్లు నీరు లేక ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దేరుపై గ్రోయిన్ నుంచి కస్పా కాలువ ద్వారా నీరు ప్రవహిస్తుంది. సుమారు రెండు ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. వడ్డాది, చిన్నప్పన్నపాలెం, గౌరీపట్నం గ్రామాలకు చెందిన రైతులు పంటలు పండించుకుంటున్నారు. ఈ ప్రాంతాన్ని మరో కోనసీమగా పిలుచుకుంటారు. ఏటా రెండు పంటలూ సమృద్ధిగా పండుతాయి. ఎప్పుడు చూసినా పచ్చని పంటలతో పొలాలన్నీ కళకళలాడుతుండేవి. చుట్టూ కరవు వచ్చినా ఇక్కడ మాత్రం పంటలు దెబ్బతినడం ఎప్పుడూ లేదు. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి కస్పా రైతులకూ కష్టకాలం తప్పలేదు. పంటలు లేక చాలావరకు భూములన్నీ బీడుగా మారిపోయాయి. మొదట్లో కొద్ది పాటిగా నీరు వస్తే అక్కడక్కడ కాస్త పల్లం భూముల్లో వరినాట్లు వేశారు. ప్రస్తుతం కాలువలో నీటిప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. విత్తనాలు వేయడం కోసం రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. సాధారణంగా ఎప్పుడైనా వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా పెద్దేరుకు నీటి కొరత ఉండేది కాదు. ఎగువన ఏజెన్సీ ప్రాంతంలో కురిసిన వర్షాలతో పుష్కలంగా నీరు ప్రవహించేది. ఈ సమయానికి నిండుగా నీటితో కళకళలాడుతుండేది. అలాంటిది ఈసారి వర్షాకాలం వచ్చినా నీరు ప్రవహించలేదు. జలాశయంలో నీళ్లు అడుగంటడంతో కిందకి వచ్చే ఊటలు పూర్తిగా తగ్గిపోయాయి. ఇంతటి దుర్భిక్ష పరిస్థితులను ఎప్పుడూ చూడలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వడ్డాది దగ్గర నీటిప్రవాహం లేని పెద్దేరు

బెయిల్‌పై వచ్చి.. దర్జాగా ఫైల్స్ ఎత్తుకెళ్లి!
కీలక దస్త్రాలు తీసుకెళ్లిన అవినీతి అధికారి మురళి

ఈనాడు డిజిటల్ - అనకాపల్లి: అనకాపల్లి జిల్లా కేంద్రంలోని మైనింగ్ కార్యాలయంలో ఇటీవల అనినీతి నిరోధక శాఖకు పట్టుబడిన సర్వేయర్ మురళీకృష్ణ అంబేద్కర్ బరితెగించారు. కార్యాలయంలో ఏడీ, డీఈ ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం కార్యాలయానికి వచ్చి గతంలో తను పనిచేసి ఛాంబర్‌లోకి ఎటువంటి అనుమతులు లేకుండా దౌర్జన్యంగా వచ్చారు. కార్యాలయ సిబ్బంది అనుమతి లేనిదే కార్యాలయానికి రాకూడదని వాదించినా.. అవేవీ పట్టించుకోకుండా మురళి తను పనిచేసిన ఛాంబర్‌లోని డైరీ, కొన్ని ఫైళ్లను తీసుకెళ్లారు. ఈ వ్యవహారం వెనుక ఉన్నతాధికారుల అండ ఉన్నట్లు పలు ఆరోపణలు వస్తున్నాయి. మురళి గతంలో సర్వేయర్‌గా ఉన్నప్పుడు కొంతమందిని అనుచరులుగా పెట్టుకుని క్వారీలు నడుపుతున్నట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. వాటికి సంబంధించిన ఫైల్స్ గురించే కార్యాలయంలో చొరబడినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఇప్పటివరకు పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

★ ఓ క్వారీకి అనుమతులు ఇచ్చేందుకు రూ. 5 లక్షలు లంచం తీసుకుంటూ మురళి గత నెల ఆరోతేదీన అనిశా అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కారు. ఆయనను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. తాజాగా బెయిల్‌పై బయటకు వచ్చారు. సస్పెండ్ అయిన వ్యక్తి కార్యాలయంలోకి ఎలా వచ్చారు? ఎవరి అనుమతితో వచ్చారు? ఏ ఫైల్స్ వెంట పట్టుకెళ్లారు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తన అవినీతి అక్రమాలు మరిన్ని బయటపడకుండా ఉండేందుకు సాక్ష్యాలను తారుమారు చేసేందుకు కార్యాలయంలోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. సస్పెండ్ అయిన అధికారి కార్యాలయంలోకి రావాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి. అలా కాకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి.. తను పనిచేసిన ఛాంబర్‌కు వెళ్లి ఫైళ్లు తీసుకెళ్లినా కార్యాలయం సిబ్బంది అడ్డుకోలేకపోయారు.

సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు 11న

సింహాచలం: శ్రావణమాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 11న సింహగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈవో వెంకటరావు తెలిపారు. దేవస్థానం పూజా సామగ్రి, కొండపైకి బస్సు ప్రయాణ సదుపాయం ఉచితంగా కల్పిస్తుందని తెలిపారు. మహిళలు ఈ నెల 5 నుంచి 9 వరకు సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో దరఖాస్తులు పొందొచ్చని పేర్కొన్నారు.

గ్రూప్ -2 ఆఫ్‌లైన్ బ్యాచ్ - సెప్టెంబర్-1(నేడే), 9 AM
ఆన్‌లైన్ క్లాసులు కూడా లభ్యం, గ్రూప్ 1&2
APP- Play Store
RS REDDY INSTITUTE
8374315777
9491601342
గురజాడ లైబ్రరీ ఎదురుగా, బాలాజీ జంక్షన్, విజయనగరం

దేశానికే ఆదర్శంగా విశాఖ అభివృద్ధి

★ ఆ స్థాయిలో అందరం కలిసి పనిచేద్దాం
★ మంత్రి నారా లోకేశ్

ఈనాడు–విశాఖపట్నం, న్యూస్‌టుడే, ఆనందపురం: 'రాష్ట్ర విభజన తర్వాత విశాఖకు ఎంతో చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. విశాఖ ఎకనమిక్ రీజియన్ దేశంలోనే తొలి వన్ ట్రిలియన్ డాలర్ల ఎకనమిక్ రీజియన్‌గా మారుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో విశాఖ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది' అని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆయన సోమవారం నగరంలో మూడు కీలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఏఐజీ ఆధ్వర్యంలోని వెయ్యి పడకల ఆసుపత్రి నిర్మాణానికి భూమి పూజ, మాజీ ముఖ్యమంత్రి రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణ, ప్రేమ ఉదయం, ఏజ్‌కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. 'విశాఖ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఏఐజీ ఆసుపత్రిని రెండేళ్లలో 650 పడకలతో అందుబాటులోకి తీసుకొస్తాం. హైదరాబాద్‌ను చంద్రబాబు అభివృద్ధి చేసిన విధంగా విశాఖ అభివృద్ధిలో కూడా ఒక కొత్త బెంచ్ మార్క్ సృష్టించబోతున్నాం. విశాఖ నంబర్ వన్‌గా ఉండాలి. దేశంలోని మోడల్ సిటీల్లో ఒకటిగా విశాఖను అభివృద్ధి చేస్తాం' అని లోకేశ్ స్పష్టం చేశారు.

ఏజ్‌కేర్ ఫౌండేషన్ పాలియేటివ్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి లోకేశ్

మంత్రి లోకేశ్‌తో శాసన సభాపతి అయ్యన్న, ఎమ్మెల్యే గంటా

» **డేటా సెంటర్ల విషయంలో అపోహలొద్దు:** 'అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పుడు వచ్చే అపోహలను తొలగించి ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. డేటాసెంటర్ల విషయంలో కూడా కొన్ని అపోహలున్నాయి. నేను వ్యక్తిగతంగా ఇంటెల్ డేటా సెంటర్‌ను పరిశీలించాను. విశాఖలో డేటా సెంటర్ల విషయంలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తాం. నీటి వినియోగాన్ని తగ్గించే ఎయిర్ కూలింగ్ వంటి సాంకేతికతలకు ప్రాధాన్యం ఇస్తాం' అని లోకేశ్ తెలిపారు.

» గంభీరం వద్ద ప్రేమ ఉదయం, ఏజ్‌కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో లోకేశ్ పాల్గొన్నారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆలయ కిచెన్ ప్రారంభించారు. హరేకృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీ శ్రీభరత్, తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ప్రీపోలియో సర్జికల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్ రొక్కమ్ శశి ప్రభ, హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులు నిష్కించన భక్తదాస పాల్గొన్నారు.

హరే కృష్ణ వైకుంఠం కల్చరల్ కాంప్లెక్స్‌కు భూమిపూజ చేస్తున్న మంత్రి లోకేశ్ తదితరులు

23వ వర్ధంతి

రావాడ శరత్‌చంద్ (బాలు)
కోటవురట్ల MCA
జననం: 09-02-1979 మరణం: 01-09-2003

రావాడ సునంద (చిన్ని)
కోటవురట్ల
జననం: 15-06-1980 మరణం: 12-09-2003

అల్లారుముద్దుగా పెంచుకున్న మా కుమారుడు, కుమార్తె మాకు దుఃఖాన్ని, జ్ఞాపకాలను మిగిల్చి మానుండి దూరమై నేటికి 23 సం॥లు గతించిననూ మీ మధుర స్మృతులు, జ్ఞాపకాలతో జీవిస్తున్న మీ కుటుంబ సభ్యులు...

అక్క - బావ :
సునీత (జాజి) - ఇ.జి. ప్రసాద్
టీచర్ Forest Dept. VSP
పిల్లలు: సామ్యుల్‌సునంద్ (రిక్కి), ప్రణవ్‌దీప్ (విన్ను), సంజన (మిని)
మరియు కుటుంబ సభ్యులు

తండ్రి - తల్లి:

రావాడ కన్నారావు Rtd. పోస్టుమాస్టర్
శ్రీమతి సరోజినీదేవి, Rtd. H.M

సమకాలీన న్యాయ విద్యకు ప్రాధాన్యమివ్వాలి

సబ్బవరం, న్యూస్‌టుడే: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్జాతీయ న్యాయ, అనుబంధ విభాగాల కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం 'సరిహద్దులకు ఆవల 2.0: అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో వృత్తులు, ధోరణులు' అనే అంశంపై ఒక రోజు అంతర్జాతీయ కార్యశాల జరిగింది. గోవా అంతర్జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ డా. ఆర్. వెంకటరావు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి డా. వై. ఉమాశంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరిని డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ డా. డి. సూర్యప్రకాష్‌రావు స్వాగతించారు. వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టంపై మరింత అవగాహన, భాగస్వామ్యం పెంచుకోవాల్సిన ఆవశ్యకత, ప్రాముఖ్యతపై అవగాహన పెంచుకోవడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రొఫెసర్ వెంకటరావు మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టానికి పెరుగుతున్న ప్రాముఖ్యతను, యువ న్యాయ నిపుణులు పోషించగల కీలకపాత్ర గురించి వివరించారు. సమకాలీన న్యాయ విద్యలో అంతర్జాతీయ చట్టాన్ని న్యాయ విశ్వవిద్యాలయాలు ఒక కీలక భాగంగా చేయాలని సూచించారు. ఉమాశంకర్ మాట్లాడుతూ కేవలం న్యాయవాదిగా ఉండటానికి, మంచి న్యాయవాదిగా మారడానికి ఉన్న వ్యత్యాసం గురించి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యాపరమైన భాగస్వామ్యం, వృత్తి అభివృద్ధిపై 'అంతర్జాతీయ న్యాయశాస్త్రంలో వృత్తికి మార్గదర్శి-సంపుటి 2'ను విడుదల చేశారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. విశ్వచంద్రనాథ్ మాదాసు, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్లు డా. సి. లక్ష్మి, డా. నీలిమ భోగడి, షెర్లీ హెప్సిబా, ప్రొఫెసర్ కొండయ్య డా. ఎస్. రాణిపాల్ పాల్గొన్నారు.

సంపుటిని విడుదల చేస్తున్న ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు, డా.వై.ఉమాశంకర్, ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాష్‌రావు

పంచదార్లలో మైనింగ్‌పై పూర్తి వివరాలు సమర్పించండి

రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండల పరిధిలోని పంచదార్ల కొండ వద్ద మైనింగ్ లీజుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం, గనులశాఖ అధికారులను హైకోర్టు ఆదేశించింది. విచారణను రెండు రోజులకు వాయిదా వేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. పంచదార్ల కొండ వద్ద మైనింగ్ లీజు మంజూరును సవాలుచేస్తూ అప్పారాయుడుపాలెం గ్రామానికి చెందిన ఉప్పులూరి నాయుడు హైకోర్టులో పిల్ వేశారు. గ్రావెల్ మైనింగ్ లీజుదారు విజయ్‌కుమార్ నాయుడు, రిత్విక్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీలక్ష్మీనరసింహ మినరల్స్ సంస్థలకు కేటాయించిన మైనింగ్ లీజులను రద్దు చేయాలని కోరారు. సోమవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. "పంచదార్ల కొండ చారిత్రక స్మారక చిహ్నం. కొండపై పురాతన శివాలయం ఉంది. ఆ ప్రాంతం రక్షిత ప్రదేశ జోన్‌లో ఉంది. అక్కడ మైనింగ్ లీజులు మంజూరుకు వీల్లేదు" అని అన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ప్రణతి వాదనలు వినిపిస్తూ ఈ కొండ ప్రాంతంలో 2.153 హెక్టార్లలో మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేశామని, ఆ ప్రాంతాన్ని నో మైనింగ్ జోన్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చిందని హైకోర్టు దృష్టికి తెచ్చారు. పొన్నవోలు సుధాకర్‌రెడ్డి స్పందిస్తూ 'మొత్తం మూడు మైనింగ్ లీజులు మంజూరు చేశారు. ఒకటి సిట్టింగ్ ఎంపీ, మరోటి డ్రైవర్, ఇంకోటి ఇతర వ్యక్తి పేరిట మంజూరయ్యాయి. ప్రస్తుతానికి ఒక లీజు మాత్రమే రద్దు చేశారు. మిగిలిన రెండింటిలో మైనింగ్ కార్యకలాపాలు జరుగుతున్నాయి" అని తెలిపారు. దీంతో పూర్తి వివరాలు సమర్పించాలంటూ గనులశాఖ అధికారులను ధర్మాసనం ఆదేశించింది.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

ఇసుకలో దాక్కొని.. పీతలను పట్టేసి

భారీ ఆకారంతో కనిపించే టేకు చేప చూపరులను ఎంతగా ఆకట్టుకుంటుందో... దాని ఆహార వేట అంతే ఆసక్తికరంగా ఉంటుంది. చదునైన శరీరం, రెక్కల మాదిరి విస్తరించిన పక్క భాగాలు, పొడవైన తోకతో కనిపించే ఈచేపలు సోమవారం పూడిమడక మత్స్యకారులకు చిక్కాయి. లోతైన సముద్రంలో జీవించే ఇవి పీతలు, చిన్న చేపలు, నత్తలు, రొయ్యలను ఆహారంగా తీసుకుంటూ మత్స్యకారులకు అరుదుగా చిక్కుతాయి. చదునైన శరీరమే ఆయుధంగా ఇసుకలో దాగి వేటచేస్తుందని మత్స్యకారులు తెలిపారు. కళ్లు శరీరంపై ఉంటూ, నోరు కింద భాగంగా ఉన్న టేకు చేపలు నిశ్శబ్దంగా వేట సాగిస్తాయని మత్స్య అభివృద్ధి అధికారి రవితేజ తెలిపారు. సొర చేప జాతికి చెందిన టేకు చేపలు పదునైన పళ్లు, మృదువైన అస్థిపంజరం కలిగి ఉంటాయని, సముద్ర అడుగున లభించే పెంకులాంటి జీవులను సైతం ఆహారంగా తీసుకుంటాయన్నారు.

మత్స్యకారులకు చిక్కిన టేకు చేప

తోకది కీలక పాత్ర..: టేకు చేప పొడవైన తోకను కేవలం దిశ మార్చుకోవడానికే కాకుండా ఆత్మరక్షణకు ఉపయోగిస్తుంది. తోక వద్ద ఉండే పదునైన ముల్లు కారణంగా దాని దగ్గరకు వెళ్లేందుకు ఇతర జీవులు సైతం వెనకాడతాయని మత్స్య అధికారులు తెలిపారు. వేట కోసం నెమ్మదిగా కదిలే ఇది ప్రమాదం ఎదురైతే వేగంగా స్పందిస్తుందన్నారు. దీంతోపాటు సముద్రాన్ని శుభ్రం చేయడంలో ఇది ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. వందల కేజీల నుంచి టన్ను బరువు వరకు పెరుగుతుందని రవితేజ తెలిపారు. – న్యూస్‌టుడే, అచ్యుతాపురం

ఖైదీలకు అందించే ఆహారంలో జాగ్రత్తలు తప్పనిసరి

నర్సీపట్నం, ఎలమంచిలి, న్యూస్‌టుడే: కారాగారంలో రిమాండు ఖైదీలకు అందించే ఆహారంలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నర్సీపట్నం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత, ఎలమంచిలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.స్పందన సూచించారు. నర్సీపట్నం, ఎలమంచిలి ఉప కారాగారాలను సోమవారం సందర్శించారు. ఆహార పదార్థాలను రుచి చూశారు. పప్పులు నిల్వ చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలన్నారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. బెయిల్ కావల్సిన వారికి న్యాయవాదిని సమకూరుస్తామని చెప్పారు. నర్సీపట్నం కారాగారంలో ఉన్న ఖైదీల్లో హెచ్ఐవీ బాధితుడిని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించాలని సూచించారు.

మాట్లాడుతున్న ఎలమంచిలి కోర్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి స్పందన

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

చోడవరం, దేవరాపల్లి, న్యూస్‌టుడే: పదేళ్ల కిందట 144 కేజీల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు నిందితులపై నేరం రుజువు కావడంతో పదేళ్ల జైలు శిక్షణ విధిస్తూ స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ సోమవారం సాయంత్రం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. శిక్ష పడిన వారిలో దేవరాపల్లికి చెందిన అతవ అచ్యుతరావు, తమిళనాడుకు చెందిన ఒచ్చు విజయకుమార్ ఉన్నారు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన వారిలో వీరిద్దరితోపాటు తమిళనాడుకు చెందిన శ్రావణకుమార్ ఉన్నారు. విచారణ పూర్తయి తీర్పు వెలువడేలోగా ఆయన మృతి చెందారని పోలీసులు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ సూర్యనారాయణ వ్యవహరించారు. ఈ కేసులో నాటి ఇన్‌స్పెక్టర్ ప్రసాదు, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ పాపునాయుడు, ఏపీపీ సూర్యనారాయణను ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ, జిల్లా సూపరింటెండెంట్ సుధీర్ అభినందించారు.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనిత

నక్కపల్లి, న్యూస్‌టుడే: పాయకరావుపేటలో ఈ నెల 2న జరగనున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన విజయవంతం చేయాలని మంత్రి అనిత కోరారు. నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన నాయకులతో సమావేశమయ్యారు. పోలవరం నీటికి సీఎం జలహారతి ఇచ్చిన తర్వాత సభలో పాల్గొంటారన్నారు. ఇందులో రైతులను భారీ ఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు. జనాల కోసం అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారని వివరించారు. నాయకులంతా అధికారులతో సమన్వయం చేసుకుని సమష్టి కృషితో దీన్ని జయప్రదం చేయాలన్నారు. కోట్ని బాలాజీ, కొప్పిశెట్టి వెంకటేష్, లాలం కాశీనాయుడు, కురందాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, అమలకంటి అబద్ధం, యేజర్ల వినోద్‌రాజు, పెట్ల లింగంనాయుడు, వైబోయిన రమణ, జానకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యజ్ఞంలా రాష్ట్రంలో అభివృద్ధి పనులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: యజ్ఞంలా రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని తెదేపా కార్యాలయంలో జలహారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై ప్రత్యేక సమావేశం సోమవారం జరిగింది. దీనికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, తెదేపా జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు హాజరయ్యారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో తెదేపా పనిచేస్తోందన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. భారీస్థాయిలో నియోజకవర్గం నుంచి జనాలను తరలించాలని సూచించారు. పట్టణ అధ్యక్షులు నానాజీ, నియోజకవర్గస్థాయి నాయకులు పీలా తులసీరామ్, మళ్ల చినబాబు, కర్రి ఆదిబాబు, మేరుగు బాపునాయుడు, పతివాడ చిన్నయ్యనాయుడు, రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందం, తెదేపా జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, చలపతిరావు, నాగేశ్వరరావు

2,50,725 మందికి పింఛన్ల పంపిణీ నేడు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీలు, జిల్లాలోని 24 మండలాల పరిధిలో మంగళవారం 2,50,725 మంది లబ్ధిదారులకు రూ.106 కోట్లు పింఛన్లుగా పంపిణీ చేయనున్నట్లు గ్రామీణాభివృద్ధి సంస్థ జిల్లా ప్రాజెక్టు అధికారిణి శచీదేవి చెప్పారు. ఉదయం 7 ఏడు గంటల నుంచే సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తారన్నారు. లబ్ధిదారులు ఇంటి వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు.

కంపెనీలో ఉద్యోగి ఆత్మహత్య

రాంబిల్లి, న్యూస్‌టుడే: అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలోని (సెజ్) నవోపోర్ ఫార్మా కంపెనీలో కెమిస్టుగా పనిచేస్తున్న పి.నాగేశ్వరరావు (48) సోమవారం ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడని సీఐ నరసింగరావు చెప్పారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరానికి చెందిన ఈయన కొంతకాలంగా కంపెనీలో పనిచేస్తూ కుటుంబంతో ఎలమంచిలిలో నివాసం ఉంటున్నారు. సోమవారం విధులకు హాజరై మధ్యాహ్నం కంపెనీ ఆవరణలో ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. పోలీసులు కంపెనీకి చేరుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.

డేటా సెంటర్ ఏర్పాటుకు భూసర్వే పూర్తి

రెన్యూ గ్రీన్ డేటా సెంటర్‌కు గుర్తించిన భూములు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: తూటిపాల రెవెన్యూ పరిధిలో ఏర్పాటు కానున్న రెన్యూ గ్రీన్ డేటా సెంటర్‌కు భూసర్వే పూర్తయిందని తహసీల్దారు నూకరాజు చెప్పారు. సుమారు 433 ఎకరాల్లో డేటా సెంటర్ ఏర్పాటు కానుందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో త్వరలో గ్రామ సభ నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరించనున్నట్లు పేర్కొన్నారు.

'బొప్పరాజుపై విమర్శలు సరికాదు'

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యలపై నిబద్ధతతో పనిచేస్తున్న జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుపై భూపతిరాజు రవీంద్రరాజు విమర్శలు చేయడం మంచిదికాదని రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శశిధర్ సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. గత ఎన్నికల్లో కూటమి పార్టీలు మెరుగైన పీఆర్‌సీ, 5 డీఏలు, అరియర్స్ బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చాయని.. దీన్ని అమలుచేయాలని బొప్పరాజు కోరితే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని శశిధర్ పేర్కొన్నారు. ఎవరి ప్రయోజనం కోసం భూపతిరాజు స్క్రిప్ట్ చదువుతున్నారో ఉద్యోగులకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. గత రెండేళ్లుగా ఎన్నోసార్లు విజ్ఞాపన చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదని దీంతో విసుగు చెంది ఉద్యమానికి శ్రీకారం చుట్టారన్నారు. బొప్పరాజు ఉద్యమానికి వీఆర్‌ఓ సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు.

కొబ్బరిలో బెండ.. లేదిక బెంగ



కొబ్బరిలో సాగు చేస్తున్న బెండ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సాగు లాభసాటిగా మారాలంటే ఆలోచనల్లోనూ మార్పు రావాల్సిందే. ఒకే పంటను పండించే కన్నా.. ఉన్న భూమిలోనే రెండు, మూడు రకాల పంటలు సాగు చేస్తే అధికాదాయం పొందవచ్చని ఆచరణలో నిరూపిస్తున్నారు. పెంటకోటకు చెందిన రైతు బి.కొండబాబు. రెండు దశాబ్దాలుగా వ్యవసాయం చేస్తున్న ఈయన పాయకరావుపేట మండలం సత్యవరం గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకున్నారు. ఎకరా విస్తీర్ణంలో మిరప వేశారు. ఆరు నెలల్లో 20 టన్నుల దిగుబడి వచ్చింది. సగటున కేజీ రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయించారు. దిగుబడి తగ్గే సమయంలో మిరప మొక్కల మధ్య బీర సాగు చేపట్టారు.

★ మిరప మొక్కలను ఆధారంగా చేసుకుని బీర పాదులు పెరిగేలా ఏర్పాట్లు చూశారు. కలుపు నివారణకు ప్లాస్టిక్ కవర్లతో మల్చింగ్ చేశారు. పక్కనే ఉన్న కొబ్బరి తోటలో అంతర పంటగా 40 సెంట్ల విస్తీర్ణంలో బెండ సాగుకు శ్రీకారం చుట్టారు. పెట్టుబడి రూ.20 వేల వరకు కాగా 50 రోజుల్లోనే పంట చేతికొచ్చింది. రోజుకు 50 కేజీల కాయలను మార్కెట్‌లో కేజీ రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు.

పంట మార్పిడి.. తక్కువ పెట్టుబడి: ఒకే పంటను ఎప్పుడూ పండించను. పంట మార్పిడి చేస్తుంటా. ఏకకాలంలో రెండు, మూడు పంటలు పండిస్తున్నా. ఒక పంటకు గిట్టుబాటు ధర రాకపోయినా ఇబ్బంది లేదు. సేంద్రియ పద్ధతులను అనుసరిస్తూ క్రిమిసంహారక మందుల వినియోగాన్ని చాలా వరకు తగ్గించా. – **కొండబాబు, రైతు**

మిశ్రమ పంటలతో.. ఆదాయం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఎక్కువ మంది రైతులు ఒకే రకం పంట వేస్తుంటారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే నష్టపోతుంటారు. కొందరు మిశ్రమ పంటల పండిస్తూ నిశ్చింతగా ఉంటున్నారు. ఒక పంట దెబ్బతిన్నా.. రెండో పంటతో నష్టం పూడ్చుకుంటున్నారు. గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఊబపాలెం గ్రామానికి చెందిన గిరిజన రైతులు ఏడాది పొడవునా కాయగూరలు, ఆకుకూరలు పండిస్తున్నారు. బీన్స్, ముల్లంగి, బరబాటీతోపాటు కాకర, బెండ, బీరను పందిరి సాగు చేస్తున్నారు. అంతర పంటలుగా మొక్కజొన్న, పచ్చిమిరప, వంగ, అల్లం పండిస్తున్నారు. వీటితోపాటు తోటకూర, పాలకూర, బచ్చలి కూర, చుక్కకూర, గోంగూర, కొత్తిమీర సాగు చేస్తున్నారు.

తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న మిశ్రమ పంటలు

★ కాయగూరల సాగులో ఇప్పటివరకూ నష్టమైతే రాలేదు. కొద్దిపాటి భూమిలోనే కాలానుగుణంగా ఏడాది పొడవునా అన్ని రకాల కాయగూరలు, ఆకు, దుంపకూరలు, పందిరి సాగు కింద పలు రకాల పంటలను పండిస్తున్నాం. కాయగూరలను ఎప్పటికప్పుడు వారపు సంతల్లో విక్రయిస్తుంటాం. అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల కొన్ని పంటలు దెబ్బతిన్నా మిశ్రమ పంటల సాగు వల్ల మొత్తంగా నష్టపోయే పరిస్థితి అయితే లేదని రైతులు చెబుతున్నారు.

ఏడాది పొడవునా మొక్కజొన్న

అల్లూరి జిల్లాలో కొందరు రైతులు మొక్కజొన్న సాగు చేస్తూ మేలైన దిగుబడులు సాధిస్తున్నారు. నీటి వసతి ఉన్నచోట ఏడాది పొడవునా దేశవాళీ మొక్కజొన్నను పండిస్తుండగా, కొందరు ప్రత్యేకంగా తీపి మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. చింతపల్లి మండలం చౌడుపల్లి, కొత్తపాలెం, పెదబరడ ప్రాంతాల్లో మాలీ రైతులు దేశవాళీ రకంతోపాటు అమెరికన్ స్వీట్ కార్న్ సాగు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటూ కాయగూరలతోపాటు మొక్కజొన్నను వాణిజ్య పరంగా పండిస్తున్నారు. –న్యూస్‌టుడే, చింతపల్లి

నీటి సదుపాయం ఉంటే చాలు

★ కొయ్యూరు మండలం డౌనూరు మొదలు చింతపల్లి మండలంలో పలు పర్యాటక ప్రాంతాలున్నాయి. ఎర్రవరం వద్ద జలపాతాలతోపాటు లంబసింగి ఘాట్, తాజంగి, చెరువులవెనం సందర్శనకు వచ్చే పర్యాటకులకు మొక్కజొన్న పొత్తులను విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. మైదాన ప్రాంత వ్యాపారులు ముందుగానే తోటలను కొనుగోలు చేసి మొక్కజొన్న దిగుబడులను పట్టణ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

★ 'రెండు ఎకరాల పొలం ఉంది. అందులో సగం కాయగూరలు, ఆకుకూరలు పండిస్తుంటాం. మిగతా సగంలో మొక్కజొన్న సాగు ద్వారా ఏడాది పొడవునా ఆదాయం వస్తోంది. ఎకరాకు రూ.పది వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఖర్చులన్నీ పోను రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఆదాయం వస్తోంది. మూడు నెలలకోసారి పంట చేతికొస్తోంది. స్థానికంగానే మార్కెటింగ్ సదుపాయం ఉండటం వల్ల రవాణా ఖర్చులు మిగులుతున్నాయ'ని చౌడుపల్లి రైతు **కిలో అర్జున్** చెబుతున్నారు.

మన్యం నుంచి మైదానానికి ఎగుమతి అవుతున్న మొక్కజొన్న

రాజ్‌మా దిగుబడులు పెరగాలంటే..

?: రెండేళ్లుగా రాజ్‌మా సాగు చేస్తున్నా. సరైన దిగుబడులు రావడం లేదు. పెరగాలంటే ఏం చేయాలి. – రాజారావు, కొత్తూరు

✔: రాజ్‌మా విత్తనాలను రైజోబియం (ద్రవరూప జీవన ఎరువు)లో శుద్ధి చేయాలి. ఆ తర్వాత పొలంలో విత్తనాలు వేస్తే ఫలితం ఉంటుంది.

?: వలిసెల్లో అధిక దిగుబడినిచ్చే రకాలున్నాయా. – కంకిపాటి సత్తిబాబు, ఏబులం

✔: మన్యం వాతావరణం అనుకూలంగా ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి అనువైన రకాలను ఎంపిక చేసుకోవడమే కీలకం. జేఎన్ఎస్-28 రకం ఇక్కడి వాతావరణంలో అధిక దిగుబడినిస్తుంది.

?: వరి నారు ఇప్పుడు నాటొచ్చా. – రాంబాబు, పాడేరు

✔: సెప్టెంబరు సమీపించడం వల్ల ఇప్పుడు వరి సాగుకు ఆస్కారం లేదు. స్వల్పకాలిక రకాలు వేసుకున్నా.. రానున్న రోజుల్లో వర్షాలు లేకపోతే పంట దెబ్బతింటుంది. ప్రత్యామ్నాయంగా వలిసెలు, రాజ్‌మా, రాగులు వంటివి సాగు చేయడం ఉత్తమం.

రైతుల ప్రశ్నలు, సందేహాలకు పాడేరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త, విస్తరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త **డాక్టర్ పీబీ ప్రదీప్‌కుమార్** సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

సాగులో.. సందేహాలా

పంటల సాగులో సలహాలు, సందేహాల నివృత్తికి ఫోన్ చేయవచ్చు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త **దాడి ఉమామహేశ్వరరావు** సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉదయం 10–11 గంటల మధ్య **94410 75852** నంబరును సంప్రదించవచ్చు.

మార్కెట్‌లో బెల్లం ధరలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా అన్ని రకాల బెల్లం ధరలు తగ్గాయి. రంగుల ధరలు వంద కేజీలకు రూ.490, మధ్య రకాలు రూ.1,080, నాసి రకాలు రూ.810 తగ్గాయి.

రకం	రంగులు	మధ్య	నాసి
గత వారం (రూ.)	5,820	5,700	5,100
ఈ వారం (రూ.)	5,330	4,620	4,290

రైతులు, విద్యార్థులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నాగేంద్రప్రసాద్

నలుపు రంగుకు కారణం.. ఇనుము లోపం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వరి మొక్క మొదళ్ల చుట్టూ పచ్చగా మధ్యలో నల్లగా మారితే ఇనుము లోపమనే విషయం రైతులు తెలుసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. తిమ్మరాజుపేటలో సోమవారం శాస్త్రవేత్త, విద్యార్థులు వరి పొలాలను పరిశీలించారు. ఇనుము లోపం నివారణకు 13-05-45 ఫార్ములా4 వినియోగించుకోవాలన్నారు. చౌడు నేలలకు మొక్క చుట్టూ ఆకులు తెల్లగా మధ్యలో పచ్చగా ఉంటాయని దీని నివారణకు 13-0-45, ఫార్ములా 4 వాడాలని సూచించారు. నక్షత్ర గడి ఉన్న పొలాల్లో ఫెనోక్సాప్రాస్-పి-ఇథైల్ 250ఎంఎల్, ఆల్‌మిక్స్ కాని నొమనిగోల్డ్ 100ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. తామరపురుగు ఉన్న పొలంలో టీగ్లాస్ వేపనూనె, టీగ్లాస్ కుంకుడుకాయ రసం కలిపి పది లీటర్ల నీటిలో కలిపి వాడాలని రైతులకు వివరించారు. రైతులు ఆడారి అర్జున్, కృష్ణ, వెంకట అప్పారావు, సోమునాయుడు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

వాణిజ్య బ్యాంకుల కన్నా అధిక వడ్డీ

రావికమతం, న్యూస్‌టుడే: ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకులో డిపాజిట్లపై అన్ని వాణిజ్య బ్యాంకులకన్నా అధిక వడ్డీ రేట్లు చెల్లిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు అనకాపల్లి డివిజన్ రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్ చంద్ర చెప్పారు. రావికమతంలో ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకును సోమవారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 1360 గ్రామీణ వికాస్ బ్యాంకుల్లో అన్నిరకాల సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. గతంలో గ్రామీణ బ్యాంకులు జిల్లాలో పరిమితంగా ఉండేవి. ఇప్పుడు ప్రతీ ఐదు కి.మీ. దూరానికి ఒక బ్రాంచి ఉందని చెప్పారు. వాణిజ్య బ్యాంకుల మాదిరిగా గ్రామీణ వికాస్ బ్యాంకులు గృహ, వ్యవసాయ, భూమి కొనుగోలుకు, బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తున్నాయని... ఏటీఎం, యూపీఐ చెల్లింపులు కూడా గ్రామీణ వికాస్ బ్యాంకుకి అనుసంధానమై ఉన్నాయని చెప్పారు. నర్సీపట్నం, పాయకరావుపేటలోని బ్యాంకుల్లో ఫేస్ యాప్ ద్వారా డబ్బులు విత్ డ్రా చేసుకునే సౌకర్యాన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పీఎంఎస్‌వై, పీఎంజెజెవై బీమా పథకాలు కూడా బ్యాంకు ద్వారా చేస్తున్నామన్నారు. అనకాపల్లి జిల్లాలో 200 మంది బ్యాంకు మిత్రలను గ్రామీణ ప్రాంతాల్లో నియమించామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక కోటి 25 లక్షల బ్యాంకు ఖాతాలు ఉండటం గ్రామీణవికాస్ బ్యాంకు ప్రత్యేకతని ఆయన పేర్కొన్నారు. ఏపీజీవీబీ రావికమతం బ్రాంచి మేనేజర్ కె.కోటేశ్వరరావు, స్థానిక వ్యాపారులు, వర్తకుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ బ్రాంచిని ప్రారంభిస్తున్న సతీష్ చంద్ర

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ ఏపీ ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) అనకాపల్లి శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాయుడు మాట్లాడుతూ డీఏ బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. మధ్యంతర భృతి అమలు చేసి వేతన సవరణ కమిటీని ప్రకటించాలన్నారు. ఒప్పంద ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. కాంట్రిబ్యూటరీ పింఛను పథకం రద్దు చేసి పాత పింఛనుపథకం అమల్లోకి తేవాలన్నారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జనరల్ కార్యదర్శి లోవరాజు, రెవెన్యూ అసోసియేషన్ జనరల్ కార్యదర్శి శ్రీరామమూర్తి, వివిధ సంఘాల ప్రతినిధులు, సీపీఐ, సీపీఎం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

★ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంబీసీలకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలని యాత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మారేష్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అణగారిన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించాలన్నారు. న్యాయవాది గంగాధర్ మాట్లాడుతూ 139 కులాలకు చెందిన బీసీ రిజర్వేషన్లలో కేవలం 10 శాతం ఉన్న కులాలు మాత్రమే లబ్ధి పొందుతున్నాయన్నారు. అనంతరం డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు.

★ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఎస్సీ సాధన కమిటీ కో కన్వీనర్ రామకోటేశ్వరరావు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ పాలనాధికారి విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

డీఆర్వో సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు, ఉద్యోగులు

విధులకు వైద్యుడి గైర్హాజరుపై విచారణ

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి-2 ఉదయ్ కుమార్ విధులకు గైర్హాజరు కావడంపై జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ సోమవారం విచారణ జరిపారు. ప్రధాన వైద్యాధికారి నళిని ఒక్కరే విధులకు రావడం, రోగులకు సేవలు అందించడం చేస్తున్నారు. రెండో వైద్యాధికారి ఉదయ్ కుమార్ తరచూ సాయంత్రం వేళల్లో వచ్చి వెళ్తుంటారనే ఆరోపణలున్నాయి. దీనిపై గ్రామస్థులు పలుమార్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారికి (డీఎంహెచ్‌ఓ) ఫిర్యాదులు చేశారు. ఈ ఆరోపణలపై డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు చంద్రశేఖర్ సోమవారం ఆరోగ్య కేంద్రానికి వచ్చి విచారణ జరిపారు. నివేదికను డీఎంహెచ్‌ఓకు అందజేస్తామని తెలిపారు.

పీహెచ్‌సీ సిబ్బందిని విచారణ చేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి చంద్రశేఖర్

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

రావికమతం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా గాజువాక సమీపంలో చిన గంట్యాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృత్యువాత పడింది. రావికమతానికి చెందిన **కంచిపాటి బంగారమ్మ** (62) గాజువాకలో ఉంటోన్న మనమరాలు ఇంటికి ఆదివారం వెళ్లింది. సోమవారం ఉదయం మనుమరాలు భర్తతో కలిసి స్కూటీపై వెళ్తుండగా ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలంలోనే బంగారమ్మ మృతి చెందగా మరో ఇద్దరు గాయపడినట్టు స్థానికులు తెలిపారు. బంగారమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	124	120
లైవ్	151	140
డ్రెస్‌డ్	234	250
స్కిన్‌లెస్	264	260

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

FINANCIAL SERVICES

స్థిరాస్తులపై మార్టిగేజ్ లోన్స్, Govt. ఎంప్లాయిస్, రిటైర్డ్ పెన్షనర్సుకు పర్సనల్ లోన్స్, స్థిరాస్తి ఏ బ్యాంక్‌లో ఉన్నా జిరాక్స్ పేపర్సుపై 2nd మార్టిగేజ్ లోన్. నోసిబిల్, అయోధ్య సొసైటి. Cell: 9666547338

మా ప్రైవేట్‌ఫైనాన్స్‌ద్వారా తక్కువ వడ్డీకి పొలాలు స్థలాలు ఇళ్ళు ప్లాట్లు ఫ్యాక్టరీస్ స్కూలు/కాలేజిలు స్థిరాస్తులపై లోన్స్/టేకోవర్‌లోన్స్ వెంటనే ఇవ్వబడును. ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ లోన్ కలదు. (బ్యాంక్‌లోన్స్ ఉన్నా ఇవ్వబడును) నోబ్రోకర్/నోసిబిల్ వైజాగ్. 7075368585.

REAL ESTATE

FLAT FOR SALE

MADDILAPALEM

Apartment - 3BHK, Area 1840 sft, Maddilapalem, Vizag. Contact : 9502783675

LAND FOR SALE

GENERAL

INDUSTRIAL LAND FOR SALE
Industrial Plot N/A Converted, Ac. 2.80 Cents, Near NTPC Plant Parawada, Anakapalli District.
CONTACT: 7386776877

PLOT FOR SALE

PENDURTHI

VUDA Approved Plots with all developments Gated Community Layout available Nr. Pendurthi and Sabbavaram ✆ 9398694446

VZM ROAD

రఘు కాలేజీ దగ్గర భూమాత వారి NRI రాయల్ VUDA లేఔట్ లో 183 చ.గ N/F ప్లాట్ నెం : 107 అమ్మకం. ఫోన్: 86869 97700

PROPERTY FOR SALE

GENERAL

Apartment for Sale- 3 BHK, Area- 1850 Sq.Ft. Maddilpalem, Visakhapatnam. Contact: 9502783675.

TO LET

COMMERCIAL

JAGADAMBA

Commercial Spaces 1000 Sft. wirth Furniture & 4500 Sft. in 3rd Floor @ Jagadamba Junction Vizag for Rent. ✆ 8374816236.

Clinic for Rent Available. C-9, Doctors & Doctor's Plaza, Opp:KGH OP Gate, VSP. Cont: Dr. K.Vishnu Prasad ✆9849544287, 9908035477

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు లైజనింగ్ ఆఫీసర్, మేనేజర్ మరియు జూనియర్ అకౌంట్స్ కావలెను. Ph: 7702923335, 8790343335.

అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి విశాఖపట్నం బ్రాంచి నందు పని చేయుటకు రికవరీ ఎగ్జిక్యూటివ్స్-8(Nos) కావలెను. 2 వీలర్ కచ్చితంగా ఉండాలి. ✆ 83410 32818, 73861 32388.

రిసెప్షనిస్ట్ (F) హిందీ, ఇంగ్లీష్ మాట్లాడగలిగిన వారు కావలెను. గాజువాక, NAD, PMపాలెం క్లినిక్స్ కొరకు ఫోన్: 7981915024.

ప్రముఖ బ్యూటీ సెలూన్‌లో పనిచేయుటకు Female Assistants కావలెను. వసతి, ట్రైనింగ్ కలదు. జీ: 18,000/- Qlf: Inter. ✆ 6281360264.

ప్రముఖ విద్యా సంస్థకు బస్సు డ్రైవర్ MVP కోలనీ నుండి కావలెను. Ph :9705368161

FACULTY/ TEACHERS

Wanted Mathematics teacher for a school near Boyapalem. Contact: 9010137154

SECURITY GUARDS

విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం, గుర్రంపాలెంలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గంటల డ్యూటీ, జీతం: 15,000/-, వివరాలకు.7288004466

వైజాగ్ సిటీ పరిసర ప్రాంతాల్లో పనిచేయుటకు సెక్యూరిటి సూపర్ వైజర్స్, సెక్యూరిటి గార్డ్స్, లేడి సెక్యూరిటిగార్డ్స్. జీతం: 20,000/- to35,000/- ✆ 9014709272.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

గణిత ఫార్ములా పుస్తకాల పంపిణీ

అనకాపల్లి, న్యూస్‌టుడే: జీవీఎంసీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గణిత ఫార్ములా పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. యల్లపు సత్యనారాయణ 80వ జయంతి సందర్భంగా ఆయన సతీమణి జయలక్ష్మి ఈ పుస్తకాలను సమకూర్చారు. భోగలింగేశ్వర ఆలయ ఛైర్మన్ సత్యనారాయణ, జగన్నాథరావు, నరసింహారావు, లలితకుమారి, జనార్దన్, రమణ, నాగేశ్వరరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పుస్తకాలు అందిస్తున్న జయలక్ష్మి

నేడు మెగా రక్తదాన శిబిరం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని వేల్పులవీధి సీతారామ కల్యాణ మండపంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం జరగనుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా మెగా యూత్ ఫోర్స్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సురభి హరీష్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభంకానుంది. ఆసక్తి ఉన్న యువతీయువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ఆయన కోరారు.

ఉచిత కంటి శస్త్రచికిత్సలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆసుపత్రిలో సోమవారం 9 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేశారు. కంటి వైద్యులు విష్ణువర్ధన్‌రెడ్డి రోగులకు కళ్లద్దాలు మందులు అందజేశారు. ఆసుపత్రి ఛైర్మన్ బుద్ధ రమణాజీ, కోఛైర్మన్ సతీష్, రోటరీ క్లబ్ అధ్యక్షులు సోమసుందర్, కార్యదర్శి కుష్వంత్, మల్లేశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడు రహదారుల విస్తరణ

జిల్లా ఆసుపత్రి వద్ద కొలతలను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి

అనకాపల్లి, న్యూస్‌టుడే : వాణిజ్య కేంద్రమైన అనకాపల్లి పట్టణంలో వందలాది వాహనాలతో నిత్యం రోడ్లన్నీ రద్దీగా ఉంటాయి. పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా పట్టణ రహదారులను విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రధానమైన మూడు రోడ్ల విస్తరణ చేపట్టాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. ఈ మేరకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి ఆధ్వర్యంలో ప్రణాళికా విభాగం అధికారులు సోమవారం కొలతలు తీసే పనులకు శ్రీకారం చుట్టారు.

▼ నూకాలమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు భక్తులతో రద్దీగా ఉంటోంది. ఇరుకుగా ఉన్న ఈ రోడ్డును విస్తరించాలని ఏళ్ల కిందటే ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలేదు. 2.2 కి.మీ. దూరం ఉన్న ఈ రోడ్డు విస్తరణలో 189 భవనాలను తొలగించాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం జాతీయ రహదారిలోని నూకాలమ్మ ఆర్చి నుంచి పూడిమడక రహదారి కూడలి వరకు రోడ్డును విస్తరించనున్నారు.

▼ రద్దీగా ఉండే పెరుగుబజారు రహదారి విస్తరణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రధాన రహదారి నుంచి గాంధీబొమ్మ కూడలి వరకు పనులు పూర్తి చేశారు. అక్కడి నుంచి కోట్ని వీధి మీదుగా రైల్వే స్టేషన్ వరకు 0.8 కి.మీ. దూరం రహదారిని విస్తరించనున్నారు. పూల్‌బాగ్ కూడలి నుంచి సాధుగుడి వరకు 0.6 కి.మీ. దూరం ఆసుపత్రి రహదారినీ విస్తరిస్తారు.

సమస్యల జోరు.. పరిష్కరించాలి సారు

సీఎం పర్యటనపై జనం ఆశలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే

పేట నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనిస్తున్నా దీర్ఘకాలిక సమస్యలు నేటికీ పరిష్కారం కావడం లేదు. గోదావరి జలాలకు జలహారతి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వస్తున్న తరుణంలో ముఖ్యమైన సమస్యలు పరిష్కరిస్తారని జనం ఆశిస్తున్నారు.

తాండవ దుఃఖదాయని..: తాండవ నది ద్వారా వచ్చే సాగు జలాల మాటెలా ఉన్నా నియోజకవర్గ కేంద్రం పాయకరావుపేటకు ఇది దుఃఖదాయని అనే చెప్పాలి. నదిలో ఏ మాత్రం వరద నీరు చేరినా పేట వాసులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సిందే. అటువైపు తుని పట్టణానికి ఇదే దుస్థితి. నదికి రక్షణ గోడ లేకపోవడంతో ఈ పరిస్థితి వస్తోంది. నీలం తుపాను, 1990లో వచ్చిన వరదల ధాటికి పట్టణం పూర్తిగా నీట మునిగింది. ఒక వ్యక్తి చనిపోయాడు. తాంబైల్లో వచ్చిన వరదల్లో వంతెన కుప్పకూలింది. ఏటా చాకలిపేట, పాండురంగస్వామి ఆలయం వెనుక తదితర ప్రాంతాలు కొద్దిపాటి నీటికే ముంపు బారిన పడుతున్నాయి. దీని నుంచి గట్టెక్కించేందుకు నీలం తుపాను తర్వాత గోడ నిర్మాణానికి అప్పట్లో రూ.17 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అనంతరం ప్రతిపాదన బుట్టదాఖలైంది. ఏడాది క్రితం అధికారులు మరోసారి రూ.70 కోట్ల వ్యయంతో రక్షణ గోడకు ప్రతిపాదనలు ఇచ్చారు. ఇప్పటికీ మోక్షం కలగలేదు. దీంతోపాటు తాండవ, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల మధ్య ప్రవహిస్తున్న వరహా నది గట్లు బలహీనంగా మారాయి. తరచూ కోతకు గురవుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపుతారని ప్రజలు ఆశిస్తున్నారు.

పర్యాటక అభివృద్ధి..: పాయకరావుపేట నుంచి ఎస్.రాయవరం మండలం వరకు ఆహ్లాదకరమైన తీరప్రాంతం ఉంది. రేవుపోలవరం, పెంటకోట లైట్ హౌస్, పాల్మన్‌పేట తీరం తదితర ప్రాంతాలను పర్యాటక ప్రదేశాలు తీర్చిదిద్దాల్సి ఉంది. ఈ దిశగా దృష్టి సారించాలి. దీంతోపాటు మండలంలోని ప్రముఖ బౌద్ధారామం సీతమ్మవారి మెట్టను అభివృద్ధి చేయాలి.

జెట్టీల నిర్మాణం..: మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలోనూ, తిరిగి తీరానికి చేరేందుకు జెట్టీలు లేకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. కెరటాల ఉద్ధృతికి పడవలు తిరగబడి మత్స్యకారులు ప్రాణాలు కోల్పోతున్నారు. వెంకటనగరం వద్ద జెట్టీ నిర్మిస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది.

బకాయిలకు మోక్షం కలిగేనా..: దార్లపూడిలోని ఏటికొప్పాక, పాయకరావుపేటలోని తాండవ చక్కెర కర్మాగారాలకు చెందిన 500కు పైగా కార్మికులు జీతాల కోసం అలమటిస్తున్నారు. వారికి సంబంధించి సుమారు రూ.30 కోట్ల బకాయిలు నేటికీ చెల్లించలేదు. కర్మాగారాలు మూతపడటంతో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పదవీ విరమణ ప్రయోజనాలు అందక అవస్థలు పడుతున్నారు.

ఘనంగా శ్రీకృష్ణాలయం ప్రారంభం

నక్కపల్లి: సారిపల్లిపాలెంలోని శ్రీకృష్ణాలయం ప్రారంభం సోమవారం ఘనంగా జరిగింది. గ్రామస్థుల సహకారంతో నిర్మించిన గుడిలో పండితులు ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు చేశారు.

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: భీమవరం గ్రామదేవత నూకాంబిక అమ్మవారి ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ శిఖరాన్ని భక్తులు ప్రతిష్ఠించారు.

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో సోమవారం సంకష్ట హర చతుర్థి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మండపం ఆవరణలో వేద పండితులు వ్రతం నిర్వహించారు. ట్రస్టీ ఆంజనేయరాజు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. వేల్పులవీధి రాఘవేంద్ర స్వామి ఆలయంలో స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక రథంలో స్వామిని మేళతాళాలతో ఊరేగించారు.

కశింకోట, న్యూస్‌టుడే: సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయంలో శ్రావణమాసం మూడో సోమవారం సందర్భంగా సహస్ర ఘటాభిషేకం చేశారు. ఉదయం పంచామృతాభిషేకాలు, పెసలు, గోధుమలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం తొలి ఘటంతో అర్చకులు బాబ్జీ అభిషేకం చేసి నక్షత్ర హారతి ఇచ్చారు.

అ వీ ఇ వీ

సాఫ్ట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాయకరావుపేట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఆగస్టు 30న మాకవరపాలెంలో అండర్-14 సబ్ జూనియర్ పోటీలకు ఎంపిక నిర్వహించారు. దీనిలో బాలుర విభాగంలో బి.సాత్విక్, డి.నందకిషోర్, బాలిక విభాగంలో వి.గీతాప్రసన్న, కె.రాగవర్షిణి జిల్లా జట్టు తరఫున ఆడేందుకు అర్హత సాధించారు. వీరంతా ఈనెల 12 నుంచి 14 వరకు విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు డి.వి.శ్రీనివాస్ తెలిపారు.

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక మండలం గణపర్తిలో మోదకొండమ్మ అమ్మవారి పండగ సందర్భంగా గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో చూచుకొండ ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో గణపర్తి, తృతీయ స్థానంలో ఒంపోలాపురం, నాలుగు, ఐదో స్థానాల్లో రాజాం, చూచుకొండ కాలనీ జట్టు నిలిచాయి.

సీఎం పర్యటన విజయవంతం చేయాలి

కోటవురట్ల, న్యూస్‌టుడే: ఈ నెల 2న పాయకరావుపేటలో జరిగే సీఎం పర్యటన విజయవంతం చేయాలని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, తెదేపా మండల అధ్యక్షుడు పెట్ల లింగన్నాయుడు కోరారు. కోటవురట్ల మండల పరిషత్తు కార్యాలయంలో తెదేపా కార్యకర్తలు, అధికారులతో సమావేశమయ్యారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: పేటలో జలహారతి కార్యక్రమానికి వస్తున్న సీఎం చంద్రబాబునాయుడు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి): ప్రజా సంబంధ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ చెప్పారు. ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం సమస్యలపై వినతులు స్వీకరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ధర్నా

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పాయకరావుపేట ఆర్డీసీ కాంప్లెక్స్ దగ్గర 45 ఏళ్లగా నివాసముంటున్న దళితులకు పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వ పథకం మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అప్పలరాజు డిమాండ్ చేశారు. దళితులతో కలిసి సోమవారం అడ్డురోడ్డు జంక్షన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

అనకాపల్లి పట్టణం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనకాపల్లి ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు చేపట్టిన రిలే దీక్షలు సోమవారం రెండో రోజుకు చేరాయి. నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు నినాదాలు చేశారు.

కశింకోట, న్యూస్‌టుడే: ఆర్‌ఈసీఎస్ పాలిటెక్నికల్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది చేపట్టిన నిరసన దీక్షలకు విద్యుత్తు వినియోగదారుల సంఘం సోమవారం మద్దతు తెలిపింది.

పారా మెడికల్ ఉద్యోగుల ఆందోళన

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి 50 పడకల ప్రభుత్వాసుపత్రి పారా మెడికల్ ఉద్యోగుల ఆందోళన కొనసాగుతోంది. దీనిలో భాగంగా సోమవారం వీరంతా నల్ల రిబ్బన్లు ధరించి ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు.

పోషకాహారంతో అనారోగ్యం దూరం

నక్కపల్లి: పోషకాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండొచ్చునని ఆయుష్ విభాగం వేంపాడు వైద్యాధికారి కె.రఘు వెల్లడించారు. బంగారమ్మపేటలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 142 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందించారు.

బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల బోటు ప్రమాదంలో మృతి చెందిన వెంకటనగరానికి గ్రామానికి చెందిన మత్స్యకారుడు ఉప్పాడ బాబ్జి కుటుంబానికి శ్రీనివాసవాడ బలిజ సంఘం ఆర్థిక సాయం అందజేసింది. సంఘం ప్రతినిధులు బాధితుడి కుటుంబాన్ని పరామర్శించి, సుమారు రూ.25 వేల చెక్‌ను అందజేశారు.

దేవాలయం ఉంది.. దారి లేదు

గోపాలపట్నంలో ప్రసిద్ధ సీతమ్మవారి కొండపై ఉన్న దేవాలయానికి వెళ్లేదారి లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పురాతనమైన కాశీవిశ్వేశ్వరుడి ఆలయంతో పాటు ఇతర దేవీదేవతల ఆలయాలు ఇక్కడ కొలువు తీరాయి. మొక్కులు తీర్చుకునేందుకు సమీప ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడకు వస్తుంటారు. పైకి వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో భక్తులు నానా పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం మెట్ల మార్గాన్ని తొలగించి దారి మార్గం చదును చేసి వదిలేశారు. ఇది రాళ్లు తేలి ఉండటంతో వాహనాలపై వెళ్లే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆలయానికి పూర్తిస్థాయి రహదారి సౌకర్యం కల్పించాలని ప్రాంతవాసులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, పాయకరావుపేట గ్రామీణం

ఇసుక అక్రమ తవ్వకాలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం ధర్మవరం-అగ్రహారం వద్ద వరాహనదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం నదిలో నీరు పూర్తిగా తగ్గిపోవడంతో గ్రామ సమీపంలోని నది గర్భంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. తవ్వకాల వల్ల నదిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో పశువులు నీటిలోకి దిగితే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. పెనుగొల్లుకు చెందిన వ్యక్తులు ఇసుక తవ్వకాలు చేపట్టారు, దీనిపై అధికారులకు తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మాజీ వార్డు సభ్యుడు గొన్నాబత్తుల శ్రీను ఆరోపించారు. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకట్ట వేయాలని కోరారు.

కాంప్లెక్స్ దారి.. జాగ్రత్తగా వెళ్లాలి మరి..

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్‌గేట్ వద్ద కల్వర్టు మరమ్మతులకు గురైంది. కల్వర్టు వద్ద ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల రాకపోకలతో పాటుగా ద్విచక్రవాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. కల్వర్టు మరమ్మతులు చేపట్టకపోతే కూలే ప్రమాదముంది. ముందుగానే మేల్కొని సమస్యను పరిష్కరించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

షెల్టర్ లేక.. బస్సు రాక

పాయకరావుపేట, న్యూస్‌టుడే: నర్సీపట్నం రోడ్డు కూడలి జాతీయ రహదారిపై ప్రయాణికులు నానాపాట్లు పడుతున్నారు. కాకినాడ జిల్లా తుని వైపు నుంచి ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు సహా ప్రైవేటు వాహనాలు విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నం వైపు వెళ్తుంటాయి. వీటి కోసం తాండవ జంక్షన్ వద్ద ప్రయాణికులు పెద్దఎత్తున వేచి ఉంటారు. ఇక్కడ బస్సు షెల్టర్ లేకపోవడంతో మండుటెండలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి. ఈ ప్రాంతంలో షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులతోపాటు స్థానికులు కోరుతున్నారు.

పవన్ కల్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలు

ముందస్తు జన్మదిన వేడుకల్లో విద్యార్థులు, సంస్థ సభ్యులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను ముందస్తుగా సోమవారం నిర్వహించారు. జీవీఎంసీ ఉడ్‌పేట ప్రాథమిక పాఠశాలలో కేకు కోసి విద్యార్థులకు మిఠాయిలు పంచారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాలు పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగపాక, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన సందర్భంగా సెప్టెంబరు 2న అచ్యుతాపురంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఇంటి నుంచి ఎలమంచిలి గుర్నపు కల్యాణ మండపం వరకు బైక్‌ర్యాలీ జరుగుతుందని జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురామ్ తెలిపారు. మునగపాక మండలం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కోరారు. అదేరోజు పాయకరావుపేటలో పోలవరం కాలువ జలహారతి కార్యక్రమానికి రైతులు భారీ సంఖ్యలో హాజరుకావాలన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

అనకాపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ అన్నారు. 80వ వార్డులో ఆరుగురు లబ్ధిదారులకు రూ.5.8 లక్షల విలువైన చెక్కులను సోమవారం అందజేశారు. నాయకులు జోగినాయుడు, త్రినాథ్, మురళి, సంతోష్ పాల్గొన్నారు.

మహిళకు చెక్కు అందిస్తున్న పీలా గోవింద

సేవలతో ఉద్యోగులకు గుర్తింపు

ఎలమంచిలి: విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు నిత్యం పాటుపడిన ఉపాధ్యాయుడు నాగమంతి వీర రాఘవ రమణమూర్తి కిషోర్ సేవలు అభినందనీయమని సహచర ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్టేషన్‌రోడ్డు జెడ్పీ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసి సోమవారం ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఎలమంచిలి మున్సిపాలిటీలో ఏళ్లుగా పనిచేసి పదవీ విరమణ పొందిన గణపతిరావును మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఘనంగా సన్మానించారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పి.మణికుమార్‌ను ఘనంగా సన్మానించారు.

కిషోర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి పట్టణం: నాలుగు దశాబ్దాలుగా సేవలు అందించి పదవీ విరమణ చేసిన ఎల్ఐసీ ఏఓ నర్సింగరావును పాలసీదారులు, కార్యాలయంలో సోమవారం సత్కరించారు.

నెహ్రూచౌక్ (అనకాపల్లి): తుమ్మపాల జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శంకరరావు పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది.

రాంబిల్లి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉప ఎంపీడీఓగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన పి.ఎస్.శాస్త్రిని ఘనంగా సత్కరించారు.

సంచార జాతులకు అండగా భాజపా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సంచార జాతులకు భాజపా అండగా నిలుస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు చెప్పారు. అనకాపల్లిలో సంచార, అర్ధసంచార జాతుల విముక్తి దివాస్ స్ఫూర్తి కార్యక్రమం సోమవారం జరిగింది. భాజపా నాయకులతో కలిసి ప్రదర్శన చేపట్టారు. రావుగోపాలరావు కళాక్షేత్రంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఈశ్వరరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి గోపీశ్రీనివాస్ మాట్లాడుతూ సంచార జాతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం భాజపా కార్యాలయంలో నాయకులు వినతులు స్వీకరిస్తారన్నారు. అనంతరం పలువురిని సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే పీలాగోవింద సత్యనారాయణ, భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పిల్లా రమాకుమారి, వెంకట్రావు, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావుయాదవ్, రామకృష్ణ పాల్గొన్నారు.

భాజపా నాయకులతో సంచార జాతుల ప్రదర్శన

వార్డుల తుది జాబితా ప్రదర్శన

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలో పంచాయతీల వారీగా వార్డుల తుది జాబితా సోమవారం అధికారులు విడుదల చేశారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఎంపీడీఓ కె.చలపతిరావు, పరిపాలనాధికారి డి.సీతారామరాజు తదితరులు ఓటరు జాబితాలను అందుబాటులో పెట్టారు. అదేవిధంగా పంచాయతీల వద్ద కార్యదర్శులు వివరాలను ప్రదర్శించారు. మండలంలో 33 పంచాయతీల పరిధిలో 326 వార్డులున్నట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

నక్కపల్లి మండల పరిషత్తు కార్యాలయం వద్ద జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

నృత్య పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

కశింకోట, న్యూస్‌టుడే: సెయింట్ జాన్స్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల మూడో తరగతి విద్యార్థిని **శ్రీవర్షిణి** జాతీయ స్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ చూపి 'నాట్య కౌముది' అవార్డు అందుకుంది. విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ విశాఖలోని కళాభారతి ఆడిటోరియంలో ఇటీవల నిర్వహించిన 14వ జాతీయ స్థాయి నృత్య పోటీల్లో శ్రీవర్షిణి విజేతగా నిలిచింది. పాఠశాల ఛైర్‌పర్సన్ అనూరాధ, ప్రిన్సిపల్ రూపానంది, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

పాటల పోటీల విజేతలకు బహుమతులు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: గవరపాలెం సంతోషి మాత ఆలయ ప్రాంగణంలో శ్రావణమాసం సందర్భంగా ట్రాక్ సింగింగ్ పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 55 మంది గాయకులు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ప్రియగీత, నిత్యప్రియ, జగదీశ్వరికి నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఐదుగురికి కన్సోలేషన్ బహుమతులు, రూ.వెయ్యి చొప్పున నగదు ఇచ్చారు. న్యాయ నిర్ణేతలుగా సంగీత దర్శకులు ఇంద్రగంటి లక్ష్మీశ్రీనివాస్, తెలుగు ఆచార్యులు బాలసౌజన్య కుమార్ వ్యవహరించారు. వైద్యులు కాండ్రేగుల విష్ణుమూర్తి, బుద్ధ శివాజీ, మారిశెట్టి భాస్కరరావు, దాడి వాసు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విజేతలతో నిర్వాహకులు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: వెదురువాడ సాయిప్రియ లేఅవుట్‌లో వీధి దీపాలు వెలగడంలేదు. – సన్యాసిరావు, కాలనీవాసి ✓: వీధి దీపాలను ఏర్పాటు చేయించడానికి చర్యలు తీసుకుంటాం. – రత్నకుమారి, పంచాయతీ కార్యదర్శి, వెదురువాడ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని గవరపాలెం పరమేశ్వరి పార్కు రోడ్డులో మురుగు కాలువలను శుభ్రం చేయడం లేదు. దోమలు పెరిగి, రోగాలు వ్యాప్తి చెందుతున్నాయి. – అప్పలనాయుడు, అనకాపల్లి, ✓: కాలువను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం. – రవికుమార్, జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి

అనకాపల్లి, న్యూస్‌టుడే: గవరపాలెం సతకంపట్టు వద్ద వీధిదీపాలు పూర్తి స్థాయిలో వెలగడం లేదు. – కొణతాల లక్ష్మి, అనకాపల్లి, ✓: వీధిదీపాలు పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – చక్రవర్తి, జోనల్ కమిషనర్, అనకాపల్లి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని షీలానగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. – త్రినాథ్, స్థానికుడు, ✓: వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు చేపడతాం. – శివరాం, పంచాయతీ ఈవో

అనకాపల్లి, న్యూస్‌టుడే: స్థానిక సత్యమ్మతల్లి రహదారిలో మురుగునీరు కాలువల్లో నిలిచిపోతోంది. దోమల బాధ భరించలేకపోతున్నాం. – బుద్ధ సరోజ, అనకాపల్లి, ✓: కాలువలను శుభ్రం చేయిస్తాం. దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్, అనకాపల్లి

ఆక్రమణదారులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్

రాంబిల్లి, న్యూస్‌టుడే: ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్‌ఈజెడ్) రెండో విడత భూసేకరణలో ఉన్న జెడ్.చింతువ గ్రామంలో ప్రభుత్వ భూముల్లో సాగు చేస్తున్న ఆక్రమణదారులకూ పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల సాగులో లోవపాలెం, గజిరెడ్డిపాలెం, వెంకయ్యపాలెం మత్స్యకారులతో పాటుగా ఇతర రైతులు ఉన్నారని ఉప తహసీల్దారు రమేశ్‌బాబుకు వివరించారు. మాజీ సర్పంచులు ఎరిపల్లి చిట్టిబాబు, రంగాల రాజు ఆధ్వర్యంలో రైతులు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఉప తహసీల్దారు రమేశ్‌బాబును కలిసి వినతి పత్రం అందించారు. జిల్లాలో భూసేకరణ జరుగుతున్న మండలాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పరిహారం చెల్లిస్తుండగా తమకు మాత్రం ఇచ్చేది లేదని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎలమంచిలి గ్రామీణం, మునగపాక, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కొక్కిరాపల్లి మాజీ కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ పేర్కొన్నారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా కొక్కిరాపల్లి శివారు రెల్లి కాలనీలో తెదేపా కార్యకర్తలు పర్యటించి, కరపత్రాలు పంపిణీ చేశారు. మునగపాక అంబేడ్కర్ కాలనీలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టరు డొక్కా నాగభూషణం సోమవారం ఇంటింటికీ తెదేపా కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమపథకాల గురించి వివరించారు. డొక్కా తాతారావు, లీలావతి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంచుతున్న తెదేపా శ్రేణులు

శ్రీ సిద్ధిలింగేశ్వర స్వామి వారి దేవస్థానం
దేవాదాయ ధర్మాదాయశాఖ
మెయిన్ రోడ్డు, అనకాపల్లి పట్టణం (దేవాలయం కోడ్: 15701)
టెండరు కమ్ బహిరంగ వేలం ప్రకటన

[illegible]

సంఖ్య	[illegible]	[illegible]	కాలపరిమితి
01.	3'x 9' మెట్ల క్రింద షాపు	రూ.20,000/-	ఆఫర్ల తేది నుండి 3 సంవత్సరముల కాలమునకు

[illegible] నిమిత్తము ఆధార్ కార్డు, ఓటరు ఐ.డి. కార్డు/పాన్ కార్డులలో ఏదైనా ఒక జెరాక్సు కాపీ సమర్పించవలెను. టెండరు వేయువారు షాపుకు నెలకు ఎంత అద్దె చెల్లించగలరో వ్రాయుచూ పట్టికలో తెలిపిన ధరావతు మొత్తంను కార్యనిర్వహణాధికారి, శ్రీ సిద్ధిలింగేశ్వర స్వామి వారి దేవస్థానం, అనకాపల్లి వారి పేరున డి.డి.లు తీసి టెండరుతో ఆతపరచి సీల్డు కవరులో పెట్టి టెండరు బాక్సులో వేయవలెను. టెండరు ఫారము 1కి రూ.200/-లు చెల్లించి దేవస్థానం వద్ద తీసుకొనవలెను. పాటలో పాల్గొను పాటదారుడు వ.నెం.1 లోగల షాపునకు రూ. 1,00,000/-లు విలువ గల సాల్వెన్సీ సర్టిఫికేటు ఇవ్వవలెను. మిగిలిన షరతులు దేవాలయం కార్యాలయం పనివేళలలో తెలుసుకొనగలరు. **స్వామివారి సేవలో..**
ఇట్లు, **కార్యనిర్వాహణాధికారి**

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
తుని మెయిన్ బ్రాంచ్ (00942), తుని, కాకినాడ జిల్లా

సంక్షిప్త డిమాండు నోటీసు
(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

(I) ఋణగ్రహీతలు : 1) శ్రీమతి మందపల్లి ఆశారత్నం, భర్త : నాగేశ్వరరావు, డి.నెం.15-111/1, వార్డు నెం.15, ప్లాటు నెం.42ఎ, హైవే దగ్గర, పాయకరావుపేట గ్రామం, పాయకరావుపేట మండలం, విశాఖపట్నం జిల్లా-531126. 2) శ్రీ మందపల్లి నాగేశ్వరరావు, తండ్రి : మందపల్లి గురువులు, డి.నెం. 2-87/2, వడాలవాని లక్ష్మీపురం, పాయకరావుపేట, విశాఖపట్నం జిల్లా-531126.

(II) చెల్లించవలసిన బాకీ మొత్తము : హౌసింగ్ లోన్ ఖాతా నెం.31214378967 కు తేది.27.07.2026 నాటికి రూ.2,50,224/- (అక్షరాలా రెండు లక్షల యాభై వేల రెండు వందల ఇరవై నాలుగు రూపాయలు మాత్రమే) + తేది.28.07.2026 నుండి తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు కాస్ట్సు, ఛార్జీలు, ఇతరములైన ఖర్చులు మొదలగునవి.

(III) NPA తేది: 30.06.2026 డిమాండ్ నోటీసు తేది: 27.07.2026

(IV) చరా / స్థిరాస్తి వివరములు : నక్కపల్లి యస్ఆర్ఓ నందలి తేది.22-10-2009 నాటి రిజిష్టర్డు అమ్మకం దస్తావేజు డాక్యుమెంట్ నెం.2828/2009 ప్రకారం శ్రీమతి మందపల్లి ఆశా రత్నం, భర్త : నాగేశ్వరరావు గారి పేరున గల ఆస్తి : విశాఖపట్నం జిల్లా, నక్కపల్లి సబ్ డివిజన్, పాయకరావుపేట మండలం, పాయకరావుపేట గ్రామ పంచాయితీ, సర్వే నెం. 89/2డి, 89/2సి, 89/2బి, 89/2ఎ. సమీప డి.నెం.15-111/1 వద్ద బైపాస్ రోడ్డు, 15వ వార్డు వద్ద మెట్ట భూమి ఎ.2.27-1/2 లోని ఆమోదిత బి.ఎ.నెం.59/2006, పిఆర్ నెం.58/2009 ప్రకారం ప్లాటు నెం.42ఎ గా గల 187.59 చ.గ.లు ఆస్తి. హద్దులు : ఉత్తరం : 33.00 అ.లు--- ప్లాటు నెం.53ఎ, దక్షిణం : 33.00 అ.లు ---33.00 అ.లు వెడల్పు రోడ్డు, తూర్పు : 51.00 అ.లు--- ప్లాటు నెం.42బి, పడమర : 51.00 అ.లు---ప్లాటు నెం.42.

పైన చెప్పబడిన ఋణగ్రహీతలు **భారతీయ స్టేట్ బ్యాంక్, తుని మెయిన్ బ్రాంచ్ (00942), తుని, కాకినాడ జిల్లా** వారి నిర్వహణలో ఉన్న వారి నుండి ఋణం పొంది ఉన్నారు. సదరు ఋణమునకు పైన పేర్కొన్న ఆస్తిని హామీగా ఇచ్చియున్నారు. ఋణగ్రహీతలు ఋణము యొక్క నియమ, నిబంధనలను అనుసరించి సకాలంలో చెల్లించకపోవుటచే సదరు ఖాతాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నియమనిబంధనల ప్రకారము నిరర్థక ఖాతాగా పరిగణింపబడినది. బ్యాంకు వారు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించిన డిమాండు నోటీసు ఋణగ్రహీతల సంతకములు లేకుండా తిరిగి వచ్చినందున పత్రికా ముఖంగా మీకు నోటీసు జారీ చేయుడమగుచున్నది. కావున సదరు ఋణగ్రహీతలు పైన పేర్కొన్న మొత్తములను ఇప్పటి నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూరిటీపై SARFAESI చట్టం, 2002లోని నిబంధనలు అమలు చేసేందుకు, చర్యలు చేపట్టుటకు సెక్యూర్డు క్రెడిటార్ అగు దిగువ సంతకందారునకు అధికారం కలదు.

తేది : 31.08.2026 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : తుని భారతీయ స్టేట్ బ్యాంక్

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: ఇరుముడి, కిక్, చిరంజీవి, టాక్సిక్, హాయ్, విశ్వనాథ్ అండ్ సాంగ్స్
చోడవరం: పూర్ణా: విశ్వనాథ్ అండ్ సన్స్, సాయిలక్ష్మి: హుషార్ పిట్టలు, శ్రీసాయి లక్ష్మి: ఇరుముడి

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో దేవరాపల్లిలో నేడు శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరగనున్నాయి. హిందూ ధర్మ ప్రచార పరిషత్, జిల్లా ధర్మ ప్రచార మండలి సంయుక్త నిర్వహణలో ఉదయం 8.30 గంటలకు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆలయ అర్చకులు నాగేశ్వర శర్మ తెలిపారు. ఈ వ్రతాలకు వచ్చే మహిళా భక్తులందరికీ పూజాద్రవ్యాలను జిల్లా ధార్మిక కమిటీ ఉచితంగా అందజేస్తుందన్నారు.

న్యాయవాదుల ధర్నా

నర్సీపట్నం కోర్టు ప్రవేశద్వారం వద్ద నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: రక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు కోర్టు ప్రవేశ ద్వారం వద్ద సోమవారం ధర్నా చేశారు. విధి నిర్వహణలో ఆటంకాలు కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించేందుకు చట్టాన్ని అమలు చేయడమే మార్గమని పేర్కొన్నారు.

మట్టితో మెరుస్తున్న దేవుళ్లు

చౌడువాడలో వినాయక విగ్రహాలు

గౌరీపరమేశ్వరులు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: చౌడువాడ గ్రామంలో మే నెల నుంచి డిసెంబర్ వరకు వేలల్లో వినాయక విగ్రహాలు తయారవుతున్నాయి. ఇక్కడ అద్భుతమైన విగ్రహాలు తయారవుతాయి. ఒడిశా, పశ్చిమ్‌బెంగాల్, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు చెందిన వారు లారీలతో వచ్చి విగ్రహాలను తీసుకుంటున్నారు. రానున్నది వినాయక చవితి కావడంతో వినాయక విగ్రహాలను తయారు చేయడం ఇతర ప్రాంతాలకు తరలించడం చురుగ్గా జరుగుతోంది. తదుపరి దుర్గాదేవి నవరాత్రులు కావడంతో దుర్గాదేవి ప్రతిమలను తయారు చేస్తున్నారు. వినాయక చవితి రోజుల్లో వినాయకుడి విగ్రహాలను, దేవీ నవ రాత్రులకు దుర్గాదేవి, కార్తీక మాసంలో గౌరీ పరమేశ్వరులు, శ్రీకృష్ణుడు, లక్ష్మీనరసింహస్వామి విగ్రహాలను తయారుచేస్తారు.

★ కొనేవారి అభిప్రాయాలకు అనుగుణంగా రకరకాల ఆకృతిలో మట్టితో తయారుచేస్తున్నాం. కనులకు ఇంపుగా విగ్రహాలను తయారుచేయడంతో ప్రజలు ప్రత్యేకంగా మా దగ్గర తయారు చేయించుకుంటున్నారు.– మాకారపు ఈశ్వరరావు, ప్రతిమల తయారీదారుడు. చౌడువాడ.

హాస్టళ్లకు బాసట .. విద్యార్థులకు ఊరట

వసతుల మెరుగుపై హర్షం

నర్సీపట్నం, న్యూస్‌టుడే: హాస్టల్ విద్యార్థులకు ఇప్పుడు మునుపెన్నడూ లేని సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ వసతి గృహాలు నిర్వహణను గతంలో గాలికి వదిలేశారు. మౌలిక వసతులకు తోడు పిల్లలకు కనీస సదుపాయాలు కొరవడ్డాయి. ఇప్పుడు వీరికి అన్ని సౌకర్యాలు ఒక్కొక్కటిగా చేరువవుతున్నాయి. ఇవి విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లోనూ ఆనందాన్ని నింపుతున్నాయి. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సాధారణంగా సమకూరే సామగ్రితో పాటు ఈ ఏడు తువ్వాళ్లతో కొత్త వాటి పంపిణీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇటీవల విద్యార్థులకు ఖరీదైన బూట్లు సైతం అందజేయడంతో వారంతా ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం అందించిన షూ బాక్సులను చూపుతున్న విద్యార్థులు

▼ జిల్లాలోని 30 హాస్టళ్లలోని 3,500 మంది విద్యార్థులకు ఈ సారి అంతకు ముందు లేని తువ్వాళ్లను తొలుత సరఫరా చేసింది. ఇవి కాస్త ఖరీదైన టర్కీ టవళ్లు కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తరువాత చలి నుంచి రక్షణకు రూ.800 విలువైన రగ్గులను అందజేశారు. మంచి నాణ్యతతో కూడిన స్వెటర్లు, నైట్ డ్రెస్‌లు పంపిణీ చేశారు. ఇప్పుడు తాజాగా మొత్తం అందరి విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. రూ.వెయ్యికి మించి ఖరీదు చేసే ఈ షూలుతో పిల్లలు ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ఇప్పుడు పిల్లలు చదువు పట్ల మరింత శ్రద్ధ చూపుతున్నారని వార్డెన్లు తెలిపారు.

▼ వైకాపా పాలనలో ఈ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. శిథిల భవనాలకు తోడు ఎటువంటి సదుపాయాలు అందుబాటులో లేక విద్యార్థులు యమయాతన పడ్డారు. కూటమి సర్కారు ఇప్పుడు వీటి బాగుకు పలు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పక్కా భవనాలు సమకూర్చింది. అన్నింటిలోనూ ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేసింది. సీసీ కెమెరాల సదుపాయానికి చర్యలు తీసుకుంటోంది. మరుగుదొడ్లు, స్నానాల గదులకు మరమ్మతులు పూర్తిచేసింది. ఎప్పటిలాగానే వంట పాత్రలు ఇతరాత్రా అలాగే విద్యార్థులకు సామగ్రి, పుస్తకాలు అందజేసింది. వీటితో పాటు 2014లో అప్పటి తెదేపా ప్రభుత్వం అందజేసిన వాటిని సైతం ఇప్పుడు సమకూరుస్తూ పిల్లలకు ఏ లోటూ రాకుండా చర్యలు తీసుకుంటోంది.

ఆనందంగా ఉంది..: ప్రభుత్వం మాకు ఇవి అన్నీ అందజేయడం ఎంతో ఆనందంగా ఉంది. తల్లిదండ్రులు సంతోషిస్తున్నారు. హాస్టళ్లలో ఇస్తున్న వీటి గురించి తెలుసుకున్న వారంతా ఆశ్చర్యపోతున్నారు. ఖరీదుతో పాటు నాణ్యతతో కూడిన ఇలాంటివి మాకు ఇస్తారని ఎప్పుడూ ఊహించలేదు. వీటన్నింటితో హాస్టళ్లకు ఆదరణ పెరుగుతోంది.
– జి.మిత్రసేన, పదో తరగతి

తలెత్తుకుంటున్నాం..: హాస్టల్ పిల్లలంటే గతంలో చాలా మందికి చిన్న చూపు ఉండేది. దీనికి తగ్గట్టే దాని నిర్వహణ ఉండేది. ఇప్పుడు ఇవి ఎంతగానో బాగుపడ్డాయి. ఇన్నాళ్ల ఇబ్బందులు తీరాయి. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాలతో గర్వంగా తలెత్తుకు తిరుగుతున్నాం. ప్రైవేటు బడుల పిల్లలకు ధీటుగా నిలబడగలుగుతున్నాం.
– సంజయ్, తొమ్మిదో తరగతి

వ్యాయామ ఉపాధ్యాయులుగా పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థుల్లో పది మంది వ్యాయామ ఉపాధ్యాయులుగా కొలువులు సాధించారు. గతంలో ఈ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేసిన నాగేశ్వరరావు విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. క్రీడలపై ఆసక్తి ఉన్న పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను ఎంపిక చేసి ఆటల్లో మెలకువలు నేర్పారు. మండల స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటే క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. ఆయన వద్ద శిక్షణ పొందిన వారిలో పది మంది వ్యాయామ ఉపాధ్యాయులుగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో మాకవరపాలెం జడ్పీ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న **డి.రవి** ఒకరు. క్రీడల్లో రాణిస్తున్న పాఠశాలల్లో 158 పాయింట్లతో ప్రథమ స్థానంలో నిలిచి గుర్తింపు తీసుకువచ్చారు.

ఎంఆర్‌పీఎస్ కార్యవర్గాల ఎన్నిక

కొత్తగా ఎన్నికైన ఎంఆర్‌పీఎస్ సంఘాల నూతన కార్యవర్గ సభ్యులు

రావికమతం, రోలుగుంట న్యూస్‌టుడే: రావికమతం, రోలుగుంట మండలాల ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాలు ఎం.ఎస్.పి, ఎం.ఈ.ఎఫ్ సమావేశం కొత్తకోటలో సోమవారం నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి పోసపల్లి వెంకటరావు మాదిగ ఆధ్వర్యంలో సంఘాలకు నూతన కార్యవర్గాల ఎన్నికలు జరిగాయి. సెప్టెంబరు 9న వరంగల్‌లో జరిగే జాతీయ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎలుసూరి గాటీలు, కండెల్లి వెంకటరావు, మొర్త శ్రీనివాసరావు, మంజేటి రాజు, పులగుజ్జల రమణ, పులగుజ్జల శివ తదితరులు పాల్గొన్నారు.

కూడలి.. ప్రమాద లోగిలి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: చౌడువాడ నాలుగు రోడ్ల కూడలివద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పైడమ్మపేట, కె.కోటపాడు, గరుగుబల్లి, వెంకన్నపాలెం వైపు వెళ్లే నాలుగు రోడ్ల కూడలి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నమ్మండి.. కోనేరే!

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ఒకప్పుడు గ్రామస్థులకు తాగునీరు అందించిన కె.కోటపాడు కోనేరు నేడు మురుగునీరు, తుప్పలు, డొంకలతో అధ్వానంగా ఉంది. పూడిక తీసి, గట్లు పటిష్ఠ పరిచి, తుప్పలు తొలగిస్తే పార్కు మాదిరిగా తయారై ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. వాకింగ్ ట్రాక్‌గానూ ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ప్రమాదకరంగా స్తంభం

చీడికాడ మండలంలోని గుంటికొత్తూరులోని రహదారి పక్కన వంతెన వద్ద విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభం ఓ వైపునకు ఒరిగిపోతోంది. దీంతో స్థానికులు, చోదకులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.
– చీడికాడ, న్యూస్‌టుడే

వంతెన ఇలా.. రాకపోకలెలా?

చీడికాడ, న్యూస్‌టుడే: మండలంలో వరహాపురం-పెదగోగాడ పంచాయతీ రాజ్ మార్గంలో గెడ్డపై కాలిబాట శిథిలమైంది. వర్షాలు కురిసినప్పుడు కాలిబాటపై నుంచి నీరు పారుతోంది. దీంతో వరహాపురం, పెదగోగాడ, చెట్టుపల్లి, అర్జునగిరి, తురువోలు గ్రామాల నుంచి రాకపోకలకు సాగిస్తున్నవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. పెదగోగాడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండటంతో ఈ మార్గంలోనే వరహాపురం, తునివలస, వింటిపాలెం, దండిసురవరం తదితర గ్రామాల రోగులు వస్తుంటారు. ఇక్కడ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కనే గుంత.. లీకేజీతో చింత

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: బంగారుమెట్ట గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకవుతోంది. మరమ్మతులు కోసం రోడ్డు పక్కన గొయ్యి తవ్వి వదిలేశారు. అసంపూర్తిగా పనులు చేయడంతో నీరు వృథాగా పోతోంది. లీకేజీని అరికట్టకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అ వీ ఇ వీ

12న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

రోలుగుంట: వినాయక చవితిని పురస్కరించుకుని ఈ నెల 12న రోలుగుంటలో మండలస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు రామకృష్ణ, సత్యంనాయుడు, గణేష్ చెప్పారు. వివరాలకు 99126 87143, 91378 05380 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

పుష్కరిణి అభివృద్ధికి విరాళం

చోడవరం పట్టణం: స్థానిక స్వయంభూ గౌరీపరమేశ్వర ఆలయంలో పుష్కరిణి అభివృద్ధికి శివాలయం వీధికి చెందిన వర్రి నూకరాజు, ఈశ్వరమ్మ దంపతులు ఎమ్మెల్యే రాజుకు రూ.లక్ష విరాళం అందించారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ సురేష్, శ్రీనివాసరావు, న్యాయవాది చీపురపల్లి సూర్యనారాయణ, అర్చకులు చలపతి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

రోలుగుంట: స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఇంటర్మీయట్‌లో చేరేందుకు ఇద్దరు విద్యార్థినులకు వార్డు కార్యదర్శి రమణ ఆర్థిక సాయం అందించారు. రోలుగుంటకు చెందిన గ్రంధి మంజు, పిల్లి శ్రీవాణి తల్లిదండ్రులకు రూ.6 వేల నగదు అందజేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

చీడికాడ, దేవరాపల్లి, న్యూస్‌టుడే: చీడికాడ మండలం జి.కొత్తపల్లిలో మంగళవారం జరగనున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొననున్నారు. అనంతరం పాయకరావుపేటలో సీఎం సభకు జన సమీకరణపై చీడికాడ మండల పరిషత్తు కార్యాలయంలోని సమీక్షకు హాజరవుతారు.

డిప్యూటీ ఎంపీడీవోకు సత్కారం

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. మండల పరిషత్తు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఆయన్ను సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంపీపీ జయమ్మ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటేశ్వరరావును సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

రోలుగుంట, న్యూస్‌టుడే: గతంలో ఏర్పాటు చేసిన తాగునీటి మినీ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. ట్యాంకుల నుంచి నీరు వృథాగా పోతోంది. – అప్పలస్వామి, కొండపాలెం

✔: సమస్య మా దృష్టికి వచ్చింది. ట్యాంకులకు మరమ్మతు చేయించి నీరు వృథా కాకుండా చర్యలు చేపడతాం. – నాగేశ్వరరావు, ఎంపీడీవో

దిబ్బపాలెంలో ఇంటింటికీ తెదేపా

చీడికాడ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమంపై దిబ్బపాలెంలో సోమవారం ఇంటింటికీ తెదేపా కార్యక్రమం జరిగింది. ఆ పార్టీ నాయకులు నానాజీ తదితరులు కరపత్రాలు పంచారు. నాయుడు, సోము నాయుడు, చిన్న అప్పలనాయుడు, దేముళ్లు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న నానాజీ తదితరులు

యువకుల రక్తదానం

శిబిరంలో పాల్గొన్న యువకులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: బూరుగుపాలెం మాజీ సర్పంచి వబ్బల రెడ్డి రమణ జన్మదినం సందర్భంగా సోమవారం ఏర్పాటైన శిబిరంలో 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఎంపీపీ సర్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కంప్యూటర్ వితరణ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం శాఖా గ్రంథాలయానికి పెదబొడ్డేపల్లి జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి సోమవారం కంప్యూటర్ అందజేశారు. గ్రంథాలయ అధికారిణి దమయంతి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ పాల్గొన్నారు.

తుది సమావేశంలో సమస్యల ఊసే లేదు

నాతవరం, న్యూస్‌టుడే: సమస్యల ప్రస్తావన, చర్చ లేకుండా మండల పరిషత్తు సర్వసభ్య తుది సమావేశం ముగిసింది. ఎంపీపీ లక్ష్మణమూర్తి అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. మండలంలో పలు సమస్యలు, ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులపై చర్చించకుండానే సమావేశాన్ని ముగించారు. అసంపూర్తి నిర్మాణాలు, ప్రతిపాదిత పనులకు అనుమతులపై దృష్టిసారించలేదు. శాఖల వారీ ప్రణాళికలను సంబంధిత అధికారులు వెల్లడించారు. పదవీ కాలం పూర్తికానున్న నేపథ్యంలో ఎంపీటీసీ సభ్యులను సన్మానించారు. ఎంపీడీవో శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యురాలు అప్పలనర్స, కోఆప్షన్ సభ్యుడు రజాక్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి

డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించారు. రసాయనశాస్త్ర విభాగంలో జరిగిన ఈ మేళాలో 15మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. డెక్కన్ కెమికల్స్ కంపెనీ ప్రతినిధులు భాస్కర్ పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో పదిమంది ఇంటర్వ్యూలో ఎంపిక అయ్యారు. ముగ్గురు డిగ్రీ విద్యార్థులు, ఏడుగురు పీజీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు. అధ్యాపకులు లక్ష్మీ, అనురాధ, మంగమ్మ, మాల్యాద్రి, అనురాధ, వెంకటేష్ పాల్గొన్నారు.

జలహారతికి జనసమీకరణ

చోడవరం, న్యూస్‌టుడే: ఈ నెల రెండో తేదీన పాయకరావుపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొనే జలహారతి కార్యక్రమంలో జనం అధిక సంఖ్యలో పాల్గొనేలా ప్రత్యేక చర్యలు చేపడతామని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాజానగరం తెదేపా సమన్వయకర్త బొడ్డు వెంకటరమణ, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు హాజరయ్యారు.

పోలీసులపై దౌర్జన్యం కేసులో యువకుడికి రిమాండు

సబ్బవరం, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న పోలీసులపై దౌర్జన్యం చేసి కానిస్టేబుల్‌ను గాయపరిచిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలిలా.. సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆదివారం రాత్రి 2 గంటల సమయంలో చోడవరం ఎడ్ల వీధికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై తిరుగుతుండగా గస్తీలో ఉన్న కానిస్టేబుల్ చల్లా శ్రీనివాసరావు, హోంగార్డ్ అప్పారావు, హెడ్ కానిస్టేబుల్ కిశోర్‌కుమార్ వారిని ఆపడానికి ప్రయత్నించారు. ఆపకుండా వెళ్లిపోవడంతో పోలీసులు వెంబడించారు. సబ్బవరం మండలం గాలిభీమవరం కూడలి వద్ద పట్టుకున్నారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న గొట్టి చరణ్ (22) దౌర్జన్యం చేసి లాఠీ లాక్కుని కానిస్టేబుల్ శ్రీనివాసరావును కొట్టడంతో ఆయన కంటికి గాయమైంది. యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు వెల్లడించారు.

అంకిత భావంతో విధుల నిర్వహణ

రామారావు దంపతులను సత్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు, ఉద్యోగులు

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి పాతాళ రామారావు విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేశారని వక్తలు కొనియాడారు. రామారావు ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.సత్యనారాయణ, టీఎన్‌టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ శ్రీనివాస సత్యనారాయణ, కొత్తకోట వైద్యాధికారి సురేఖ, కొత్తకోట, రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య సిబ్బంది రామారావు దంపతులను ఘనంగా సత్కరించారు. రామారావు సేవలను కొనియాడారు. కొత్తకోట ప్రధాన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డి సత్యనారాయణ పదవీ విరమణ కార్యక్రమం స్థానిక ఫంక్షన్ హాల్లో జరిగింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సత్యనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు

తాండవ అత్యవసర గేట్లకు మరమ్మతు

నాతవరం, న్యూస్‌టుడే: తాండవ జలాశయం నుంచి నీటి విడుదలకు కీలకమైన అత్యవసర గేట్లకు మరమ్మతు చేస్తున్నారు. స్లూయిస్ గేట్ల నుంచి గతంలో నీరు వృథాగా పోయేది. గతేడాది నీటి విడుదలకు ముందు రూ.8.5 లక్షలతో కొత్త గేట్లు అమర్చి నీటి వృథాను అరికట్టారు. డ్యామ్ భద్రతాధికారుల పర్యవేక్షణ అనంతరం అత్యవసర గేట్ల నిర్వహణపై అప్రమత్తమయ్యారు. అత్యవసరంగా వినియోగించాల్సిన రెండు ప్రధాన గేట్లకు వారం రోజులుగా మరమ్మతు చేస్తున్నట్లు ఏఈ శ్యామ్ చెప్పారు.

మరమ్మతు చేస్తున్న సిబ్బంది



మురుగు సమస్యపై వృద్ధుడి నిరసన

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని ఖాళీ స్థలాల్లో నిలిచిపోతున్న మురుగుతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారంతా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో 76 ఏళ్ల వయసున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి సాగి విశ్వనాథరాజు సబ్ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన దీక్షకు సిద్ధమయ్యారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఎన్నిసార్లు వినతులు అందజేసినా కనీస స్పందన లేకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో నిరసన దీక్ష చేపట్టాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. ప్రశాంతినగర్‌లోని తన ఇంటి ముందు ఖాళీ స్థలం మురుగు తటాకంగా మారిందని చెప్పారు. ఆ ప్రాంతంలో కాలువల నిర్వహణ సక్రమంగా లేక వ్యర్థాలన్నీ ఖాళీ స్థలంలోకి చేరుతున్నాయని పేర్కొన్నారు. ఖాళీ స్థలాన్ని మట్టితో కప్పించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ ఏఈ రవి హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు.

రైవాడలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

దేవరాపల్లి, న్యూస్‌టుడే : దేవరాపల్లి మండలం రైవాడలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆగస్టు 28న రైవాడ గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వచ్చారు. ఈ సందర్భంగా ఈ గ్రామ మాజీ సర్పంచి చల్లా తాతయ్యలు వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కొందరు చింపేశారు. ఈ విషయమై తెదేపాకు చెందిన తాతయ్యతోపాటు అతని తమ్ముడు వైకాపాకు చెందిన చల్లా నాయుడు వర్గీయుల మధ్య వివాదం తలెత్తింది. నాలుగు రోజుల కిందట ప్రారంభమైన ఈ వివాదం సద్దుమణగక పోవడంతో ఇరువర్గాల వారిని సోమవారం సాయంత్రం స్టేషన్‌కి ఏఎస్ఐ ప్రసాదు పిలిపించి మాట్లాడి పంపించారు. గ్రామానికి వెళ్లిన తరువాత ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో తెదేపా నాయకుడు మాజీ సర్పంచి తాతయ్యలు అన్నయ్య చల్లా వెంకటరమణ(55) తలకు బలమైన గాయం తగలడంతో అతని పరిస్థితి విషమంగా మారడంతో కేజీహెచ్‌కి తరలించారు. ఈ ఘటనలో చల్లా తాతయ్యలు భార్య నారాయణమ్మ (45), కుమారుడు సాయి (25) తదితరులు గాయపడ్డారు. ఇదే ఘర్షణలో వైకాపాకు చెందిన ఆబోతు రాము (50) తలకు గాయమవ్వగా అతని వదిన కాసులమ్మ (41) తల్లి నూకాలు (65), ఆబోతు స్వామి గాయపడ్డారు. ఈ ఘటనపై ఇరువర్గాలవారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

వెండి వస్తువుల చోరీ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: సీసీ కెమెరా పుటేజ్ పరిశీలించేందుకు వెళ్లి తిరిగొచ్చేలోగా ఇంట్లోకి దొంగ ప్రవేశించి వెండి వస్తువులను అపహరించిన ఘటన నర్సీపట్నంలో సోమవారం చోటుచేసుకుంది. ఐదు రోడ్ల కూడలిలో పుస్తక దుకాణం నిర్వహించే వెంకటకృష్ణ ఆదివారం రాత్రి మేడపై నిద్రించాడు. ఉదయం లేవగానే సందులో ఉంచిన ఇనుప పైపులు కనిపించలేదు. ఇంటి పరిసరాల్లో అనుమానితులను గుర్తించేందుకు పొరుగింట్లోని సీసీ కెమెరా పుటేజీ పరిశీలించాలని కుమారుడు దినేష్‌కు సూచించి వెంకటకృష్ణ దుకాణానికి వెళ్లిపోయాడు. దినేష్ సీసీ పుటేజ్ పరిశీలించేందుకు వెళ్లి తిరిగొచ్చిన తర్వాత తలుపు తెరచి ఉండటం గమనించాడు. తండ్రికి సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి చూడగా పది తులాల వెండి వస్తువులు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



(c) eenadu

పెందుర్తి

నేడు 'ఎలుపమ్మ' ఉత్సవం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం ఎల్లుప్పి గ్రామదేవత ఎలుపమ్మ వారి మహోత్సవం మంగళవారం ఘనంగా జరుగుతుందని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి పూజలు చేస్తారన్నారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయన్నారు.

జలహారతికి జన సమీకరణ ఏర్పాట్లు

వేపగుంట, న్యూస్‌టుడే: పోలవరం ఎడమకాలువ ప్రారంభోత్సవం ఉత్తరాంధ్రకు ప్రధాన పండుగ వంటిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఈనెల 2న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ప్రారంభం కానున్న పోలవరం ఎడమకాలువ ప్రారంభోత్సవ వేడుకల జనసమీకరణకు పెందుర్తి నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన గణబాబు సోమవారం వేపగుంటలో కూటమి నాయకులతో సమావేశమయ్యారు. నియోజకవర్గానికి 6 వేల మంది చొప్పున జనసమీకరణ చేయాలని పార్టీ నిర్ణయించిందన్నారు. ఇందుకు ప్రతీ ఒక్కరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. పోలవరం నుంచి వచ్చే నీటిని నిల్వ చేసుకునేందుకు అవకాశమున్న మేహాద్రి రిజర్వాయర్‌ను 2 టీఎంసీల సామర్థ్యానికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పంచకర్ల, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండిబాబ్జీ, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు

ఉచిత అంబులెన్సుకు విరాళం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టనున్న ఉచిత అడ్వాన్స్‌డ్ సపోర్ట్ అంబులెన్సుకు స్థానిక రాతిచెరువు కాలనీకి చెందిన శరగడం బాలు మహేంద్ర రూ.18 వేలు విరాళం అందించారు. విరాళాన్ని నగదు రూపంలో ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీనుకి సోమవారం అందజేశారు. నానమ్మ జ్ఞాపకార్థం అంబులెన్సులో అవసరమైన ఉపకరణాలను సమకూర్చాలని దాత కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు సిరమళ్ల గణేశ్ పాల్గొన్నారు.

గండిబాబ్జీకి ఎమ్మెల్యేల శుభాకాంక్షలు

వేపగుంట, న్యూస్‌టుడే: తెదేపా పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీకి అతని అభిమానులు, కార్యకర్తలు సోమవారం ముందస్తు జన్మదిన వేడుకలు జరిపారు. 95వ వార్డు అధ్యక్షులు అయిత ఎర్నిబాబు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు, బాబ్జీ యువసేన కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. తెదేపా విస్తృతస్థాయి సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల రమేశ్ బాబు, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ గండిబాబ్జీతో కేకు కట్ చేసి అభినందనలు తెలిపారు.

గండిబాబ్జీతో కలసి కేకు కోస్తున్న ఎమ్మెల్యేలు గణబాబు, పంచకర్ల, బెందాళం అశోక్

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహం

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి రైల్వేస్టేషన్ నుంచి సింహాచలం నార్త్ రైల్వే స్టేషన్ మధ్య రైలు పట్టాలపై సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని మృతదేహాన్ని కనుగొన్నట్లు విశాఖ రైల్వే పోలీసులు తెలిపారు. 40-45 ఏళ్ల మధ్య వయసున్న మగ వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడు తెలుపు రంగు బనియన్ ధరించి ఉన్నట్లు వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

పోలీసులపై దౌర్జన్యం

యువకుడికి రిమాండ్

సబ్బవరం, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న పోలీసులపై దౌర్జన్యం చేసి కానిస్టేబుల్‌ను గాయపరిచిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ జి.రామచంద్రరావు తెలిపిన వివరాలిలా.. సబ్బవరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఆదివారం రాత్రి 2 గంటల సమయంలో చోడవరం ఎడ్ల వీధికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై తిరుగుతుండగా గస్తీలో ఉన్న కానిస్టేబుల్ చల్లా శ్రీనివాసరావు, హోంగార్డు అప్పారావు, హెడ్ కానిస్టేబుల్ కిశోర్‌కుమార్ వారిని ఆపడానికి ప్రయత్నించారు. ఆపకుండా వెళ్లిపోవడంతో వారిని పోలీసులు వెంబడించారు. చివరకు సబ్బవరం మండలం గాలిభీమవరం కూడలి వద్ద పట్టుకున్నారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న గొట్టి చరణ్ (22) దౌర్జన్యం చేసి లాఠీ లాక్కుని కానిస్టేబుల్ శ్రీనివాసరావును కొట్టాడు. దీంతో ఆయన కంటికి గాయమైంది. యువకుడిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు వెల్లడించారు.

నర్సింగ్ కళాశాల అనుమతి పునరుద్ధరణ

ఈనాడు, విశాఖపట్నం: సబ్బవరంలోని ప్రథమ తేజ ఎడ్యుకేషనల్ సొసైటీ.. ఫ్లోరెన్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ కోర్సు నిర్వహణకు అనుమతిస్తూ వైద్యఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖలోని క్యూ1 బోన్స్ అండ్ జాయింట్స్ ఆసుపత్రి, కేజీహెచ్‌కు క్లినికల్ అటాచ్‌మెంట్‌కు అవకాశం కల్పించడంతో పాటు సూచించిన నిబంధనలు పాటించాలని ఆదేశించింది. నిబంధనలు పాటించని కారణంగా ఏపీ నర్సింగ్ మిడ్‌వైవ్స్ కౌన్సిల్ గతంలో ఆ కళాశాల అనుమతులు, గుర్తింపు రద్దు చేసింది. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాల గుర్తింపు రద్దు చేసింది. అనంతరం ఫ్లోరెన్స్ నర్సింగ్ కళాశాల కొత్త క్లినికల్ అనుబంధాలను పరిశీలించి నిరభ్యంతర పత్రం ఇవ్వాలని కోరింది. దీనిపై జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి తనిఖీలు జరిపారు. ప్రతిపాదిత ఆసుపత్రులను తనిఖీ చేసి నిబంధనల ప్రకారం అవసరమైన పడకల సంఖ్య, క్లినికల్ సౌకర్యాలు ఉన్నాయని ధ్రువీకరించారు. దీన్ని పరిశీలించి కళాశాల అనుమతులు పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

పెందుర్తి

ప్రయాణికులు పెరిగారు.. మెట్రో బస్సులు ఆపలేం..!

పీజీఆర్ఎస్ అర్జీకి ఆర్టీసీ అధికారుల సమాధానం

పురుషోత్తపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: స్త్రీ శక్తి పథకం అమల్లోకి వచ్చాక ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పురుషోత్తపురం బస్‌స్టాప్ వద్ద మెట్రో బస్సులు ఆపడానికి సాధ్యపడదని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేయడంపై పలువురు ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. పురుషోత్తపురం బస్‌స్టాప్ వద్ద సిటీ మెట్రో బస్సులను ఆపాలని కోరుతూ స్థానిక హెచ్‌బీకాలనీకి చెందిన వడ్డి శ్రీనివాసు జులైలో పీజీఆర్ఎస్‌లో అర్జీ సమర్పించారు. ఈ మేరకు గత నెల 10న జిల్లా ప్రజా రవాణా అధికారి అర్జీకి సమాధానం పంపించారు. పురుషోత్తపురంలోని బస్‌స్టాపుల వద్ద సిటీ, ఆర్డినరీ బస్సులు మాత్రమే ఆగే సదుపాయం ఉందన్నారు. స్త్రీ శక్తి పథకంతో ప్రయాణికుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ఇప్పుడు ఆపలేమని స్పష్టం చేశారు. నిత్యం ఉద్యోగాలు, విద్యాలయాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, మెట్రో బస్సులను తప్పనిసరిగే నిలిపేలా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన గురుకులాన్ని కొనసాగించాలని ఆందోళన

కొమ్మాది, న్యూస్‌టుడే: మారికవలస గిరిజన గురుకుల బాలుర పాఠశాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు పోరుబాట పట్టారు. 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' పేరిట గురుకులంలో చదువుతున్న 480మంది విద్యార్థులను ఇతర ప్రాంతాలకు తరలించడాన్ని నిరసిస్తూ సోమవారం పాఠశాల ప్రధాన గేటు ఎదుట గిరిజన సంఘాల నేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతుగా ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, మాజీ మంత్రి బాలరాజు, జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జీసీసీ మాజీ ఛైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి, సీపీఎం నాయకులు గంగారావు తరలివచ్చారు.

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్ స్క్రీన్-1
ఇరుముడి
స్క్రీన్-2:
విశ్వనాథ్ అండ్ సన్స్

తెదేపా బలోపేతమే ప్రధాన అజెండా

తెదేపా జోన్-I కో-ఆర్డినేటర్ బెందాళం అశోక్‌ను సత్కరిస్తున్న గండి బాబ్జీ, తదితరులు

వేపగుంట, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతమే ప్రధాన అజెండాగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని పార్టీ జోన్-1 కోఆర్డినేటర్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచించారు. పెందుర్తి తెదేపా నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం సోమవారం మీనాక్షి కల్యాణ మండపంలో జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఇంటింటి తెదేపా కార్యక్రమాన్ని నూరు శాతం విజయవంతం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఓటర్ల జాబితా, సర్ కార్యక్రమం అంశాలపై దృష్టి సారించాలన్నారు. కూటమి నాయకుల మధ్య చిన్నచిన్న సమస్యలు ఉంటే సర్దుబాటు చేసుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా తెదేపా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, 95వ వార్డు అధ్యక్షులు అయిత ఎర్నిబాబు, 96వ వార్డు నాయకులు శానాపతి శంకరరావు, ఆవగడ్డ అప్పలనాయుడు, మాజీ కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, రాపర్తికన్నా, జడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, యువ నాయకులు గండి వంశీ, పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

నేస్తాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి దళాయిపాలెం గ్రామంలో శ్రీనేస్తాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రాల నడుమ నిర్వాహకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయగోపురంపై పసిడి కలశ ప్రతిష్ఠాపన చేశారు. ఆలయ గోపురంపై నుంచి వేసిన బూరెలను పట్టుకోవడానికి భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా భక్తులతో పాటు మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలకు ఏర్పాట్లు

జనసేన శ్రేణులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఈ నెల 2న పండగ వాతావరణంలో నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే, ఉమ్మడి విశాఖ గ్రామీణ జిల్లా జనసేన అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. వేడుకల సన్నాహాలపై సోమవారం ఆయన స్థానిక రత్నగిరినగర్‌లోని క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. 2న జరిగే కార్యక్రమాలను వెల్లడించారు. వేపగుంట దరి మీనాక్షి కల్యాణ మండపంలో వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. తొలుత ఉదయం 8 గంటలకు సబ్బవరం కూడలి వద్ద ద్విచక్రవాహన ర్యాలీ ప్రారంభమై పెందుర్తి, వేపగుంట కూడళ్ల మీదుగా మీనాక్షి కల్యాణ మండపానికి చేరుకుంటుందన్నారు. అక్కడ రక్తదాన శిబిరం, కేకు కటింగ్ ఉంటుందన్నారు. ఉదయం 11 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల పార్టీ క్యాడర్‌తో పవన్ కల్యాణ్ వర్చువల్‌గా సమావేశమవుతారన్నారు. జనసేన రాష్ట్ర యువజన విభాగం యాప్ విడుదల కార్యక్రమం ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం సీఎం చంద్రబాబు పోలవరం జలాలు ఉత్తరాంధ్రకు విడుదల చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. ఈ నేపథ్యంలో అప్పగించిన బాధ్యతలను పార్టీ శ్రేణులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.



వాలీబాల్, ముగ్గుల పోటీలకు సన్నాహాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు పురస్కరించుకుని ఈనెల 1, 2 తేదీలలో సబ్బవరం మండలం అమృతపురంలో వాలీబాల్, ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ జనసేన అధ్యక్షుడు వెన్నెల నరేష్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా సంబంధిత గోడపత్రికలను సోమవారం అమృతపురంలో ఆవిష్కరించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 2న రక్తదాన, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హాజరవుతారన్నారు. సాయంత్రం డాన్స్ బేబీ డాన్స్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా గ్రామీణ జనసేన కార్యదర్శి గండి దుర్గాప్రసాద్, జనసేన మండల ఉపాధ్యక్షుడు సబ్బవరపు రవి, నెక్కళ్ల కెవిన్, పట్నాల హరీష్, రంధి లక్ష్మణ్, కర్రి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మెరైన్ ఇంజినీరింగ్‌తో మెరుగైన ఉపాధి అవకాశాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: మెరైన్ డిజైన్, మెరైన్ ఇంజినీరింగ్ రంగాల విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలున్నాయని మెరైన్ ఇంజినీరింగ్ నిపుణుడు, ఐఎంయూ కన్సల్టెంట్ ఎన్‌వీ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. ఇండియన్ మారిటైం యూనివర్సిటీ (ఐఎంయూ) ఆధ్వర్యంలో సోమవారం పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మారిటైమ్ కెరీర్ గైడెన్స్ కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎంయూ ఫ్యాకల్టీ డీఎస్‌పీ విద్యాసాగర్, సహాయ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు. మెరైన్ ఇంజినీరింగ్ రంగంలో ఉన్నత వృత్తిపరమైన అవకాశాలపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. డిప్లొమా విద్యార్థులు లేటరల్ ఎంట్రీ ద్వారా ఐఎంయూలో ఉన్నత విద్యలో బీటెక్‌లో ప్రవేశించే విధానం, అర్హతలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులకు సూచనలిస్తున్న మెరైన్ ఇంజినీరింగ్ నిపుణుడు దుర్గాప్రసాద్

రిసార్టుల్లో నిబంధనలు పాటించకుంటే చర్యలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రిసార్టుల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ కె.వి.సతీశ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన రిసార్టుల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. రిసార్టుల ప్రాంగణంలో పూర్తి స్థాయిలో వెలుతురు ఉండేలా విద్యుత్తు దీపాలు అమర్చాలని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా మద్యం తాగడం, మత్తు పదార్థాల వినియోగంపై నిషేధం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అశ్లీల నృత్యాలు, అసభ్యకర కార్యక్రమాలు పూర్తిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకుని రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని నిర్వాహకులు, రిసార్టులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిర్వాహకులకు సూచనలిస్తున్న పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్

క్రీడలతో మానసిక ఉల్లాసం

పరవాడ, న్యూస్‌టుడే: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పరవాడ సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్‌లో మూడురోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. వివిధ విభాగాల్లో నిర్వహించిన స్విమ్మింగ్, త్రోబాల్, సైక్లోథాన్ పోటీల్లో సంస్థ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. పోటీలు ముగింపు కార్యక్రమానికి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ ఆయస్కాంత జెనా ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతోందన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ ఆయస్కాంతజెనా

పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రి అందజేత

వేపగుంట, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులను ప్రతీ ఒక్కరూ ఆదరించి అక్కున చేర్చుకోవాలని జోనల్ కమిషనరు హెచ్.శంకరరావు అన్నారు. జోనల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె సీసాలు, సబ్బులు సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, సచివాలయ కార్యదర్శి భార్గవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సచివాలయాల అధికారులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు అందజేస్తున్న జడ్సీ శంకరరావు, తదితరులు

క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

సింధియా, న్యూస్‌టుడే: ఇంటర్ సర్వీస్ 74వ క్రికెట్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం విశాఖపట్నంలో ప్రారంభమయ్యాయి. ఈస్టర్న్ నేవల్ కమాండుకు చెందిన ఐఎన్ఎస్ శాతవాహన మైదానంలో కమాండు చీఫ్ స్టాఫ్ అధికారి రియర్‌అడ్మిరల్ **గోకుల్‌కృష్ణ దత్తా** ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఐఎన్ఎస్ వీరబాహు సారథ్యంలో నగరంలో రెండు ప్రీమియర్ క్రికెట్ మైదానాల్లో పోటీలు కొనసాగుతాయన్నారు. తొలి దశలో సెప్టెంబరు 1 నుంచి 16 వరకు గీతం క్రికెట్ మైదానంలో టెస్టు మ్యాచ్‌లు, రెండే దశలో సెప్టెంబరు 19 నుంచి 25 వరకు వన్‌డే మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్సుకు చెందిన జట్లు ఇప్పటికే విశాఖ చేరుకున్నట్లు పేర్కొన్నారు. క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తితో త్రివిధ దళాల జట్లు స్నేహపూర్వకంగా ఆడనున్నాయని వివరించారు.

ఉద్యోగ విరమణ సత్కారం

వేపగుంట, న్యూస్‌టుడే: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు జీవితాంతం శాశ్వతంగా గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. వేపగుంట జడ్పీ పాఠశాలలో పువ్వల వెంకట అప్పల నరసింహం సాంఘికశాస్త్రం ఉపాధ్యాయులుగా ఉద్యోగ విరమణ పొందిన నేపథ్యంలో వీడ్కోలు సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనరసింహం దంపతులను సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు కమలకుమారి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పలనరసింహంను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

ఆయుష్య గణపతి సన్నిధిలో సంకట హర చతుర్థి పూజలు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై ఘాట్‌రోడ్డులో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆయుష్య గణపతి ఆలయంలో సోమవారం సాయంత్రం సంకట హర చతుర్థి పూజలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. వేంకటాద్రి ఆలయ ప్రధానార్చకులు మహర్షి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు గణనాథుడికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి దుర్వార్చన నిర్వహించారు. విశేష నివేదనలు సమర్పించి హారతులతో ఆరాధించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పీజీఆర్ఎస్‌కు ఆరు అర్జీలు

వేపగుంట, న్యూస్‌టుడే: జోనల్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు సోమవారం ఆరు అర్జీలు వచ్చాయి. జడ్సీ హెచ్.శంకరరావు వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన ముషిడివాడలో పాఠశాల నిర్మాణానికి అనుమతులు ఇవ్వవద్దని, నాయుడుతోట-మేహాద్రిరిజర్వాయరు రహదారిలో సంతోషిమాత ఆలయం వద్ద మురుగునీరు ప్రవాహం రహదారిపై ఉంటోందని, పెందుర్తి సినిమా థియేటరులో అపరిశుభ్రతలపై చర్యలు తీసుకోవాలని, వెంకటసాయినగర్ సర్వేనంబరు.75లో అక్రమనిర్మాణాలను నిలుపుదల చేయాలని, వెదుళ్లనరవలో ఇంటిపన్నులను తగ్గించాలని, పాపయ్యరాజుపాలెంలో అక్రమనిర్మాణాలను ఆపాలని పలువురు విన్నవించారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ యోగా పోటీలకు ఎంపిక

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం బీఎస్సీ (బోటనీ) చదువుతున్న విద్యార్థిని పండూరి జయలక్ష్మి ఆగస్టు 30న విశాఖపట్నం స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన 51వ ఆంధ్రప్రదేశ్ యోగా ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. కళాశాల ప్రిన్సిపల్ టీఎంఏ నివేదిత సోమవారం ఆమెను అభినందించారు. జయలక్ష్మి మాట్లాడుతూ తాను తానం బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉండగా నిరంతరం సాధన చేశానన్నారు. అదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో కళాశాలకు గుర్తింపు తెస్తానన్నారు.

ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ నివేదిత

పారిశ్రామిక వ్యర్థాలకు నిప్పు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఏపీఐఐసీకి చెందిన భూముల్లో బీటీరోడ్లపై గుర్తు తెలియని వ్యక్తులు పారిశ్రామిక వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. రాత్రి సమయంలో వ్యర్థాలను లారీలు, వ్యాన్లపై తీసుకొచ్చి ఇక్కడ డంప్ చేయడంతో పాటు నిప్పు పెడుతున్నారు. సోమవారం తెల్లవారుజామున ఇక్కడ వ్యర్థాలను డంప్ చేసి నిప్పు పెట్టి వెళ్లిపోవడంతో పరిసరాలను పొగ కమ్మేసింది. అటుగా వెళ్లేవారంతా పొగ కారణంగా ఇబ్బందులు పడడంతో పాటు దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. గతకొంతకాలంగా ఈ ప్రాంతం పారిశ్రామిక వ్యర్థాలతో కాలుష్యమయంగా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వ్యర్థాల కారణంగా పశువులు తదితర మూగజీవులకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ వ్యర్థాలను డంప్ చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.